

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిరంతర తాగునీటి సరఫరాకు రూ.220 కోట్లు

- పరిశుభ్రతతోనే నగరానికి దేశవ్యాప్త గుర్తింపు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం 35వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో 24గంటల పాటు నిరంతరంగా తాగునీటిని సరఫరా చేసేలా అన్ని చర్యలు తీసుకున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేసిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని 35వ డివిజన్‌లో రూ.50.25లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. నగరంలోని కార్పొరేటర్లు, అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. పరిశుభ్రంగా ఉంటేనే నగరానికి దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఇళ్లను ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటారో.. వీధులను, పరసరాలను కూడా అలాగే శుభ్రంగా ఉంచాలన్నారు. నగరంలో పారిశుధ్యం ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరు కావడంతో.. నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి పంపిణీ జరుగుతుందన్నారు. రాబోయే వేసవి కల్లా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. నగరంలో డ్రైనేజీల నిర్మాణానికి మరో రూ.200కోట్లు మంజూరు జరుగుతాయన్నారు. ఖిల్లాకు రోప్‌వే కోసం కార్యాచరణ పూర్తయ్యిందన్నారు. లకారం పక్కన శిల్పారామం నిర్మిస్తున్నామని, అలాగే వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి కావాల్సిన నిధుల మంజూరు కూడా జరిగాయన్నారు. అనంతరం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన పనులను వివరించారు. తుమ్మల అంటేనే అభివృద్ధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ

చరిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- 2న మధ్యాహ్నం 2 గంటలకు కొత్తగూడెం రానున్న సీఎం
- పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో కలెక్టర్
- ఎస్పీతో కలిసి సభా ప్రాంగణం పరిశీలన

6

బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్‌ల నియామకం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఖమ్మానికి బద్దం మహిపాల్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు డా.విజయ్‌చంద్రారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

బలమే.. ఆయుధం



ఆర్థికంగా, సామాజికంగా పేరున్న అభ్యర్థులకే ప్రాధాన్యం

- పంచాయతీల్లో అన్ని పార్టీలదీ అదే దారి
- ముగిసిన తొలివిడత నామినేషన్లు
- పలుచోట్ల బరిలో రెబల్స్.. బుజ్జగింపుల్లో నేతలు

ఖమ్మం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : పంచాయతీ పోరు క్రమంగా వేడెక్కుతోంది. తొలి విడత నామినేషన్ల దాఖలు ఘట్టం శనివారంతో ముగిసింది. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ గెలుపుపై దృష్టి పెట్టాయి. ఆర్థికంగా.. కుల సామాజిక పరంగా బలంగా ఉన్న వారికే అభ్యర్థిత్వాలు ఇచ్చేందుకే మొగ్గు చూపించాయి. రిజర్వేషన్లు ఉన్నా ఆయా సామాజిక వర్గాల అభ్యర్థులు కూడా ఎన్నికల్లో ఎంత ఖర్చు పెడతారు? ఆకులాల బలం ఎంత? అనేది చూసి మరీ అభ్యర్థుల ఎంపిక చేసినట్టు స్పష్టమవుతోంది. రెండు, మూడు విడతల నామినేషన్ల ఘట్టాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో జిల్లాలో చిన్నచిన్న తండాల పంచాయతీల్లో రూ.10లక్షలు సర్పంచ్ అభ్యర్థి ఖర్చు చేసే పరిస్థితి ఉండగా, ఒక మాదిరి పంచాయతీల్లో రూ.20లక్షల వరకు ఖర్చుచేసే అవకాశాలున్నాయి. ఇక మండల కేంద్రం, మేజర్ పంచాయతీల్లో రూ.25లక్షల నుంచి 50లక్షల వరకు ఖర్చు చేయనున్నట్టు అంచనా. పోటీ ఉన్నచోట్ల ఈ ఖర్చు మరింత పెరగనుంది. మేజర్ పంచాయతీల్లో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు.. చిన్నాచితకా పంచాయతీల్లో రూ.500నుంచి వెయ్యి వరకు ఖర్చు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యే నామినేషన్లు వేసినట్టు చర్చ జరుగుతోంది.

జిల్లాలో మొత్తం 566 పంచాయతీలుండగా.. మొదటి విడతలో కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని 192 గ్రామ పంచాయతీలు, 1,740వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటికి 1740 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడత ఎన్నికలు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోని మండలాలతో పాటు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరిధిలోని మండలాల్లో జరుగుతున్నాయి దీంతో ఈ ఉఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఆయా గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరం కానుండగా.. అవసరమైన చోట్ల నేతలు కూడా బరిలో దిగనున్నారు. ఇప్పటికే మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పాలేరులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా (మిగతా 8వ పేజీలో)

ముగిసిన తొలివిడత నామినేషన్ల పర్వం

- రాత్రి వరకూ కొనసాగిన స్వీకరణ ప్రక్రియ.. నేటి నుంచి పరిశీలన
- 3న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన.. 11న పోలింగ్
- నేటి నుంచి రెండోవిడతకు నామినేషన్ల స్వీకరణ
- 183పంచాయతీలు, 1,686 వార్డులకు 14న ఎన్నికలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శనివారం ముగిసింది. ఈనెల 27నుంచి నామినేషన్లను స్వీకరణ ప్రారంభమవగా మొత్తంగా 7మండలాల్లోని 192 పంచాయతీలు, 1,740వార్డులకు నామినేషన్లను స్వీకరించారు. శనివారం రాత్రి వరకు పలు గ్రామ పంచాయతీల్లో ఆశావహులు నామినేషన్ల దాఖలుకు బారులు తీరడం గమనార్హం. ఈ క్రమంలో చివరిరోజున అధిక సంఖ్యలోనే నామినేషన్లు దాఖలైనట్టు తెలుస్తోంది. ఎన్నికల యంత్రాంగం అర్ధరాత్రి వరకు నామినేషన్ల లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇక నామినేషన్ల పరిశీలనను ఆదివారం నుంచి ప్రారంభించనున్న అధికారులు డిసెంబరు 1న తేదీన అప్పీళ్లు స్వీకరించి.. 2న పరిష్కరిస్తారు. ఇక 3న మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉండగా.. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. తొలివిడత జాబితాలో ఉన్న గ్రామపంచాయతీల్లో 11న పోలింగ్‌ను నిర్వహించనుండగా.. ఇప్పటికే అధికారులు బ్యాలెట్ బాక్సులను మండలకేంద్రాలకు తరలించారు.

రెండో విడతకు విస్తృత ఏర్పాట్లు

రెండోవిడత ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుండగా మండల స్థాయిలో ఆదివారం నోటిఫికేషన్‌ను వెల్లడించి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఉదయం 10:30నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఇందుకుగాను కామేపల్లి మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 8కేంద్రాల్లో ఖమ్మం రూరల్ మండలంలోని 21 పంచాయతీలకు 8, కూసుమంచి మండలంలో 41జీపీలకు 13, ముదిగొండ మండలంలో 21పంచాయతీలకు 9, నేలకొండపల్లి మండలంలో 57గ్రామపంచాయతీలకు 10, తిరుమలాయపాలెంలో 40పంచాయతీలకు 17 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



సూరంపల్లి రామారావు నేతృత్వంలో కొణిజర్లలో నామినేషన్‌కు ర్యాలీగా వెళుతున్న కాంగ్రెస్ శ్రేణులు

రెండోవిడత ఎన్నికల ప్రక్రియ జరగనుందిలా..

30వతేదీ ఆదివారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై.. డిసెంబరు 2 వరకు దాఖలుకు అవకాశం ఉంది. డిసెంబరు 3న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 4వతేదీ అప్పీలుకు చివరితేదీ కాగా.. 5వతేదీన పరిష్కరిస్తారు. ఇక 6 తేదీన ఉపసంహరణ చివరి రోజు. 14వతేదీ ఆదివారం పోలింగ్, అదే రోజు ఫలితాల వెల్లడి ఉంటుంది.

ఎన్నికలు జరిగే మండలాలు: ఆరు
కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం

మొత్తం పంచాయితీలు	:183
వార్డులు	: 1,686
పోలింగ్ కేంద్రాలు	: 1,686
ప్రిసైడింగ్ అధికారులు	: 2,023
ఇతరపోలింగ్ సిబ్బంది	: 2,580

అష్టదిగ్బంధనంలో జిల్లా

- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పటిష్ఠ నిఘా
- జిల్లాలోని 15ప్రాంతాల్లో చెక్‌పోస్టులు
- 24గంటలపాటు విధుల్లో అధికారులు
- మద్యం, డబ్బు, ప్రలోభాలకు చెక్ పెట్టేలా చర్యలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాను అష్టదిగ్బంధనం చేశారు. దీంతో జిల్లా అధికారుల నిఘానీడలోకి వెళ్లింది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పార్టీలు, పోటీచేసే అభ్యర్థులు ప్రజలను మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాలకు గురిచేయకుండా కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఈ ఎన్నికలు ముగిసేంత వరకు జిల్లావ్యాప్తంగా 15చెకపోస్టులను నిర్వహిస్తోంది. అక్కడ ఆరుగురు చొప్పున 24 గంటల పాటు రెండు షిఫ్టుల పద్ధతిలో స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు విధులను నిర్వర్తించనున్నాయి. దీనికోసం మొత్తం 15మంది అధికారులను కలెక్టర్ నియమించారు. వీరంతా వారికికేటాయించిన చెకపోస్టుల్లో వాహనాలను క్షుణ్నంగా పరిశీలించనున్నారు. దీంతో 30వ తారీకు నుంచి ఈ ప్రాంతాల్లో సర్వైలెన్స్ బృందాలు విధులు నిర్వహించనున్నారు.

చెక్‌పోస్టులు ఎక్కడెక్కడంటే..

బోనకల్, ఏన్కూరు, కల్లూరు, కామేపల్లి, కూసుమంచి, మధిర, ముదిగొండ, వేంసూరు, వైరా, ఎర్రుపాలెం, నేలకొండపల్లి, పెనుబల్లి, సత్తుపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం తో పాటు జిల్లా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనూ చెకపోస్టులను ఏర్పాటుచేశారు. వీటితో పాటు రిజర్వ్ సిబ్బందిని కూడా ఉంచుతున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

ఐదు చోట్ల ఏకగ్రీవం!

తొలివిడతలో కాంగ్రెస్‌కు 4, సీపీఐకి ఒకటి సొంతం

ఖమ్మం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడత నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వాటిలో కాంగ్రెస్‌కు మూడు దక్కగా.. ఒకటి సీపీఐకి దక్కింది. అయితే ఈ ఏకగ్రీవ ఎన్నికలపై అధికారికంగా ప్రకటనలు విడుదల కావాల్సి ఉంది. బోనకల్ మండలం కలకోట గ్రామ పంచాయతీ నుంచి కాంగ్రెస్ తరుఫున పైడిపల్లి అనిత ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆ పంచాయతీ కాంగ్రెస్‌కు ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ సీనియర్ నేత పైడిపల్లి కిషోర్‌కు ఆగ్రామంలో పట్టు ఉండడంతో మిగిలిన పార్టీలు ఏకగ్రీవానికి సానుకూలంగా స్పందించడంతో ఇది సాధ్యమైంది. చింతకాని మండలం రేపల్లెవాడలో కాంగ్రెస్‌కు చెందిన బీసీ మహిళ మడిపల్లి అంబిక ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే ఇదే మండలంలోని రాఘవాపురం పంచాయతీ మహిళకు రిజర్వుకాగా అక్కడ కాంపల్లి కోటమ్మ అనే మహిళ ఒక్కరే ఎస్సీ ఓటరుగా ఉండడంతో ఆమె నామినేషన్ వేశారు. దీంతో ఆమె ఎన్నిక కూడా ఏకగ్రీవం అయింది. ఆమె సీపీఐకి చెందిన ఓటరు. దీంతో ఈపంచాయతీ సీపీఐ ఖాతాలో పడబోతోంది. వైరా మండలం పుణ్యపురం గ్రామపంచాయతీలో ఎస్సీ మహిళకు రిజర్వు కాగా వెంగళ మరియమ్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఇక్కడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం జమలాపురం పంచాయతీలో సర్పంచ్ ఏకగ్రీవం అవుతుందన్న సమయంలో బీజేపీ నుంచి నామినేషన్ దాఖలైంది. దీంతో ఉపసంహరణ కోసం చర్చలు జరుగుతున్నాయి. మధిర మండలంలోని సిద్ధినేనిగూడెం(మర్లపాడు) ఎస్సీ మహిళ ఏర్పుల వెంకటరావమ్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఇక్కడి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇదే మండలం దేశినేనిపాలెం సర్పంచ్‌కు ఏకగ్రీవమని గ్రామంలో అందరూ అనుకుంటుండగా సురేష్ అనే వ్యక్తి గ్రామ సర్దుబాటును ధిక్కరించి సర్పంచ్ పదవికి నామినేషన్ వేయడంతో అక్కడ కూడా చర్చల ద్వారా రాజీ ప్రయత్నం చేస్తున్నారు. అలాగే కొణిజర్లలో మాజీసర్పంచ్ సూరంపల్లి రామారావు ఏకగ్రీవం కోసం అన్నిపార్టీలతో మాట్లాడినా చివరి నిమిషంలో బీఆర్ఎస్ తరఫున నామినేషన్ వేయడంతో అక్కడ ఏకగ్రీవం కాలేదు. రెండో విడత జరిగే ఎన్నికల్లో కూడా కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవాలకు చర్చకు జరుగుతున్నా గ్రామాల్లో కొందరు పెద్దల మాటలను పట్టించుకోకుండా యువకులు, అకతాయిలు నామినేషన్లకు సై అంటున్నారు. కొందరు వ్యూహాత్మకంగా నామినేషన్ వేసి బేరసారాలకు సిద్ధమవుతున్నారు.

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- రాష్ట్ర సాధనలో కేసీఆర్ త్యాగం మరువలేనిది
- దీక్షాదివస్‌లో మాజీ మంత్రి పువ్వాడ
- ఖమ్మంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు
- కొత్తగూడెంలో హాజరైన ఎంపీ వద్దిరాజు

6



ఖమ్మంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

భద్రాద్రి దేవస్థానంలో విజిలెన్స్ తనిఖీలు

జీఎస్టీ చెల్లింపు వివరాల సేకరణ

భద్రాచలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దేవస్థానంలోని పరిపాలన కార్యాలయంలో విజి లెన్స్ రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి తనిఖీ లు చేయడంతో పాటు వారు అడిగిన వివరాలను దేవస్థానం అధికారులు అందజేశారు. ప్రధానంగా 2017 నుంచి ఇప్పటి వరకు దేవస్థానం జీఎస్టీ చెల్లింపులను ఏ విధంగా చేసింది? ఎంత చెల్లిం చాలి? అనే వాటికి సంబంధించిన వివరాలను స్థానిక దేవస్థానం అధికారులు జీఎస్టీ అధికారులు అడిగిన విధంగా వివరాలు అందజేశారు. కాగా.. చట్టబద్ధమైన చెల్లింపులకు సంబంధించి వివ రాలను ఇప్పటికే అందించినట్లు తెలుస్తోంది. కాగా దేవస్థానం అధికారులు ఇచ్చిన సమాచారంతో విజిలెన్స్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న తనిఖీల్లో భాగంగానే ఈ ప్రక్రియ జరిగిందని వారంటున్నారు.



ఖమ్మంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- రాష్ట్ర సాధనలో కేసీఆర్ త్యాగం మరువలేనిది
- మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు
- ఖమ్మం, కొత్తగూడెంలో ఘనంగా దీక్షా దివస్

ఖమ్మంమార్కెట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల తరువాత బీఆర్ఎస్‌దే అధికారమని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షాదివస్ కార్యక్రమంలో ఆయన పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,బాణోత్ చంద్రావతి, కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో మాజీముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన త్యాగాలను గుర్తు చేశారు. కేసీఆర్ లేనిదే తెలంగాణ లేదని, ఆయన దీక్షవల్లే ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం ఊపందుకుందని పేర్కొన్నారు. ఆనాడు అన్నిపార్టీలు ఏకమై సమైక్య వాదాన్ని వినిపిస్తున్నా ఒకే ఒక్క కేసీఆర్ ధైర్యంగా నిలబడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు కంకణం కట్టుకున్నారని అన్నారు. 2009 నవంబరు 29న కేసీఆర్ చేసిన నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అందుకే నవంబరు 29 రాష్ట్రచరిత్రలో దీక్షాదివస్‌గా మిగిలిపోతుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని వారు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యమ సమయం నాటి చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది. అంతకన్నా ముందునగరంలోని పెవీలియన్ గ్రౌండ్ వద్ద గల అమరవీరుల స్థూపం, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తెలంగాణ తల్లివిగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు జడ్పీమాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, గుండాల క్రిష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ పిలుపుతోనే తెలంగాణ అగ్ని గుండంగా మారింది ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కొత్తగూడెంకలెక్టరేట్:రాష్ట్రసాధనలో కేసీఆర్ పిలుపుతోనే తెలంగాణ అగ్నిగుండంగా మారిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఆర్ఎస్ ఇన్‌చార్జ్, పార్లమెంట్ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శనివారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో దీక్షదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. తొలుత ప్రగతి మైదానం వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి పూలమాలను లేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల్ రాజేందర్, మాజీ కొత్తగూడెం మునిపల్ చైర్ పర్సన్ కాపు సీతా మహాలక్ష్మి, జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, జడ్పీటీసీలు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన మండలంగా బోడు?

ప్రతిపాదనలు సిద్ధం చేయండి: కలెక్టర్

కొత్తగూడెంకలెక్టరేట్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి మండలంలోని 'బోడు' ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని ఇల్లందుమాజీశాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య గతంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు జిల్లాలోని ఇల్లందు నియోజకవర్గంలో బోడు ప్రాంతాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయానికి అనుకూలమైన వాతావరణంపై నివేదికను రూపొందించాల్సిందిగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు జిల్లాప్లానింగ్ అధికారి, రెవిన్యూ అధికారి, పంచాయతీ అధికారి, ఇతర అధికారులను బోడుమండలం ఏర్పాటుపై నివేదికను రూపొందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

భద్రాద్రి రామయ్యకు
స్వర్ణ తులసార్చన, నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

భద్రాచలం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతా రామచంద్ర స్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకర్రబెల్లం, మాంగల్య దారణ, వేదఆశీర్వచనం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపప్రధాన అర్చకుడు కోటి రామస్వరూప్ రాఘవాచార్య పాల్గొన్నారు.

మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించండి

రాష్ట్ర కార్యదర్శి రంగారావు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రంగారావు

ఖమ్మంరూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రానున్న సర్పంచ్ ఎన్నికల్లో మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో శనివారం పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. విప్లవ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు బలపరిచిన అభ్యర్థులను ప్రజా ప్రతినిధులుగా గెలిపించడం ద్వారా ప్రజా ఉద్యమాలు బలపడతాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. అనంతరం కాచిరాజుగూడెం గ్రామంలో వివిధ పార్టీల నుంచి పలువురు మాస్‌లైన్‌లో చేరారు. వారిని రంగన్న పార్టీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, గుర్రం అచ్చయ్య,డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, డివిజన్ నాయకులు మలీదు నాగేశ్వరరావు, కుర్రావెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఖమ్మం డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

ఖమ్మంకార్పొరేషన్/వైరా, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియామకం జరిగిన నూతి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం సోమవారం ఖమ్మం కార్యాలయంలో ఏర్పాటు చేశామని, ప్రస్తుత అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆ ప్రకటనలో కోరారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు
- రెండోరోజుకు చేరుకున్న కోల్‌ఇండియా స్థాయి పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్,నవంబరు29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు నిరంతరం శ్రమించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు కోరారు. శనివారం కొత్తగూడెం ఏరియాలో జరుగుతున్న కోల్‌ఇండియా స్థాయి కబడ్డీ పోటీలు రెండోరోజుకు చేరాయి. పోటీలను కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సింగరేణి యాజమాన్యం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. అంతరించిపోతున్న క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో యాజమాన్యం పనిచేస్తుందన్నారు. ప్రతీ ఏడాది సింగరేణి వ్యాప్తంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జనరల్ మేనేజర్ పర్సనల్ జీవి కిరణ్ కుమార్, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, సింగరేణిఅధికారులు,కార్మిక సంఘాల నాయకులు, క్రీడాఅభిమానులు పాల్గొన్నారు.

హోరా హోరీగా కొనసాగిన కబడ్డీ పోటీలు

కోల్‌ఇండియా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. కోల్ ఇండియా కంపెనీలకు సంబంధించిన 8జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. శనివారం డబ్ల్యుసీఎల్ కు బీసీసిఎల్‌కు జరిగిన పోటీల్లో డబ్ల్యుసిఎల్‌కు 35పాయింట్లు రాగా బీసీ సిఎల్‌కు 13పాయింట్లు రావడంతో బీసీసిఎల్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఎంసీఎల్, ఈసీఎల్ జట్లు తడపడగా ఎంసీఎల్ జట్టుకు 22పాయింట్లు రాగా ఈసీఎల్ జట్టుకు 49పాయింట్లు వచ్చాయి. మూడో మ్యాచ్‌లో ఎన్‌సీఎల్, ఎస్‌సిసీఎల్ జట్లు తలపడగా ఎన్‌సీఎల్‌కు 33 పాయింట్లు రాగా ఎస్‌సిసీఎల్‌కు 44పాయింట్లతో విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో సీసీఎల్‌కు 22పాయింట్లు రాగా బీసీసీఎల్‌కు 44పాయింట్లు లభించాయి. ఐదోమ్యాచ్‌లో డబ్ల్యుసిఎల్‌కు 54పాయింట్లు రాగా ఎస్‌సీసీఎల్‌కు 24 పాయింట్లు వచ్చాయి. డబ్ల్యుసిఎల్ 54 పాయింట్లతో విజయం సాధించింది. ఆరోమ్యాచ్‌లో ఎన్‌సీఎల్‌కు 42 పాయింట్లు రాగా ఎంసీఎల్‌కు 24 పాయింట్లు రావడంతో ఎన్‌సీఎల్ 42పాయింట్లతో గెలుపొందింది. గెలుపొందిన క్రీడాకారులను అధికారులు అభినందించారు. కబడ్డీ పోటీలకు ప్రచారం లేకపోవడంతో క్రీడాఅభిమానులు లేక క్రీడా మైదానం వెలవెల బోయింది.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐదురోజులుగా ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థలో జరుగుతున్న ప్రీప్రైమరీ పాఠశాలల ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఐదురోజుల శిక్షణా కార్యక్రమంలో జరిగిన అంశాల గురించి శిక్షణ టర్థుల నుంచి అడిగి వివరంగా తెలుసుకున్నారు. రిసోర్స్ పర్సన్స్ వివరించిన కృత్యాల గురించి సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు మొట్టమొదటగా అభ్యసన కృత్యాలు నేర్చుకునేది పూర్వ ప్రాథమిక పాఠశాలలోనే అని వివరించారు. తద్వారా మీరు మొదటి గురువుగా వారికి గుర్తుండిపోతారన్నారు. బాల బాలికల శారీరక మానసిక కౌశలాలను అభివృద్ధి పరచడంలో ప్రయత్నం చేయాలన్నారు. ఆట పాటల ద్వారా కృత్యాలను నిర్వహించడం ద్వారా పిల్లల అభ్యసన సామర్థ్యం పెరిగి వారు చేరబోయే ప్రాథమిక పాఠశాల తదుపరి విద్యలో వారుమరింతగా రాణించగలుగుతారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శ్రవణ్, అనిల్, జీవన్ డైట్ సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- 2న మధ్యాహ్నం 2 గంటలకు రానున్న సీఎం
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో కలెక్టర్
- ఎస్పీతో కలిసి వర్సిటీలోని సభా ప్రాంగణం పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మకమైన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. డిసెంబరు2న యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి యూనివర్సిటీ ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను ఎలాంటి లోపాలూ లేకుండా నిర్వహించేందుకు ప్రతీ శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారని, అందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్, శిలాఫలకం వద్దకు చేరుకునే వీవిఐపీల తరలింపునకు మినీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రక్రియను పాల్వంచ తహసీల్దార్ పర్యవేక్షించాలన్నారు. యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించాల్సిన పూజా కార్యక్రమాల ఏర్పాట్లపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సింగరేణి మైనింగ్ కాలేజ్ ఏర్పాటుతో ప్రారంభమైన విద్యాసంస్థ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందే వరకు జరిగిన చారిత్రాత్మక ఘట్టాలను ప్రతిబింబించేలా ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు కూడా ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో జరగాలన్నారు. వీఐపీల స్వాగతం మరియు సన్మాన కార్యక్రమాల్లో పాల్గొనబోయే విద్యార్థులు, ప్రొఫెసర్లు ముందుగానే ఖరారుచేయాలన్నారు. ఉదయం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అగ్నిమాపక, వైద్యఆరోగ్య, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగిరథ, విద్యుత్, ఆర్టీసీ, రవాణా ఇలా అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే విద్యార్థులకు భోజన సదుపాయం మహిళా సంఘాల సభ్యులు పర్యవేక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనను ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద పుట్టగొడుగుల పెంపకం, సోలార్ డ్రైయర్, లైవ్లీహుడ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సోమవారం నాటికల్లా మిగిలిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్ అమలు, వీఐపీ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించాలన్నారు.

భద్రతా చర్యలు కట్టుదిట్టం: ఎస్పీ రోహిత్‌రాజు

సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశామని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. అన్ని విభాగాల సమన్వయంతో పోలీసు శాఖ బలమైన భద్రతా ప్రణాళికను సిద్ధం చేసిందని పేర్కొన్నారు. సీఎం వచ్చినప్పటి నుంచి తిరుగు ప్రయాణమయ్యే వరకు అన్ని ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వీఐపీల రాకపోకలకు ప్రత్యేక వాహన పాసులు, నిల్వ, నియంత్రణ, గేటు నిర్వహణ లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సీఎం పర్యటన సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా ఇంటిలిజెన్స్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్ డైవర్షన్లు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు అన్ని శాఖల అధికారులుపాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, అధికారులు కలిసి శిలాఫలకం పరిసరాలు, సభా ప్రాంగణం, వేదిక, రవాణా మార్గాల ఏర్పాట్లను పరిశీలించారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎంపీ



చెక్కు అందజేస్తున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి

ఖమ్మంఅర్బన్,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖిల్లాబజార్‌కు చెందిన మహమ్మద్ రజియా వైద్య చికిత్స కోసం రూ2.50 లక్షల ఎల్‌ఓసీని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి శనివారం అందించారు. ఖమ్మంలోని తన నివాసంలో బాధితురాలి కుమార్తెకు ఈ చెక్కును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయాబాయి, కొప్పుల చంద్ర శేఖర్, మియా బాయి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబోయినపల్లిలో సైబర్ క్రైం పోలీసుల సోదాలు

కల్లూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున హైదారబాద్ సైబర్ క్రైం పోలీసు అధికారులు ఓ రాజకీయ పార్టీకు చెందిన నాయకుడి నివాస గృహంలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. గ్రామంలో గల ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు నివాస గృహంలో వారు సోదాలు నిర్వహించి ల్యాప్‌టాప్‌లు సీజ్ చేశారు. ఇంకాను మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకొని కల్లూరు పోలీసు స్టేషన్‌లో విచారించారని తెలిసింది. సదరు వ్యక్తులపై సైబర్ క్రైం పోలీసులకు అందిన సమాచారంతో పలు ఆరోపణల ఆధారంగా హైదారాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని అత్యవసర కారణాలతో వ్యక్తిగత జామీనుపై విడదల చేశారు. లింగాల గ్రామానికి చెందిన మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటన కల్లూరు మండలంలో పలు రాజకీయ పార్టీనాయకుల్లో చర్చనీయంశంగా మారింది.

మేడిదపల్లిలో విద్యుదాఘాతానికి యువకుడి మృతి

తిరుమలాయపాలెం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి ఓ యువకుడు మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని జరిగింది. మండలంలోని మేడిదపల్లిలో ఓ వివాహ కార్యక్రమానికి డెకరేషన్ చేసేందుకు కొణిజర్ల మండలం బొక్కల తండ గ్రామానికి చెందిన భూక్యా విజయ్‌కుమార్ (24) డెకరేషన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు, మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు తిరుమలాయపాలెం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.జగదీష్ తెలిపారు.

దుప్పుల మృతిపై అర్బన్‌పార్క్‌లో విచారణ



నీలాద్రి అర్బన్ పార్క్‌లో విచారణ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్ పార్క్‌లో చుక్కల దుప్పి మృతిపై టాస్క్‌ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు శనివారం విచారణ ప్రారంభించారు. పార్క్‌లోని అణువణువు ఆధారాల కోసం వెతుకుతుండగా దుప్పుల మృతి వార్త నిజమేననే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ క్రమంలో నీలాద్రి అర్బన్ పార్క్‌ను ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, స్థానిక రేంజర్ పీ.స్నేహలతలు సందర్శించి సిబ్బందితో పాటు పార్క్‌కు వచ్చే పర్యాటకులను సైతం విచారణ చేశారు. విచారణలో తేలిన విషయాలను అధికారులు చెప్పేందుకు శనివారం రాత్రి వరకు నిరాకరించారు. విచారణ జరుగుతుంది, దోషులను పట్టుకుని చట్టపరంగా చర్యలు తీసుకుంటామనే విషయం తప్ప మిగతా వివరాలను వెల్లడించని పరిస్థితి ఉంది.



అసలేమైంది..

ఇటీవల ఓ వేడుకలో చుక్కల దుప్పి మాంసం వడ్డించినట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో అటవీశాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో శనివారం విచారణ ప్రారంభమైంది. గతేడాది వందకు పైగా చుక్కల దుప్పులు ఈ పార్క్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతుండగా మళ్లీ లెక్కించాల్సి ఉంది. సింగరేణి బాంబ్ బ్లాస్టింగుల కారణంగా, కుక్కలు వెంబడించడంతో జనావాసాల్లోకి దుప్పులు పరిగెత్తుకుంటూ వచ్చి కొన్ని మృత్యువాతకు గురయ్యాయి గతంలో. మరికొన్నిటికి వైద్యులు ప్రథమ చికిత్స చేసి పార్కులో వదిలేసేవాళ్లు. అయితే తాజాగా సైలెన్సర్ బిగించిన తుపాకీతో దుప్పులను వేటాడినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జీవాల గుంపు బెదిరి దుప్పులు పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, వెంగళరావు నగర్, జలగం నగర్ వైపు వస్తున్నాయనే అభిప్రాయాన్ని ప్రజలు వెలిబుచ్చుతున్నారు. పట్టణం వైపు మినహా పార్క్ చుట్టూతా ఫెన్సింగ్ ఉండగా ప్రహరీగోడ తక్కువ ఎత్తులో ఉండటంతో వేటగాళ్లు చొరబడి దుప్పులను వేటాడుతున్నారా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు.

గాయపడిన దుప్పి మృతి

గతనెల 11న వీధికుక్కలు దాడిచేయడంతో ఓ దుప్పి తీవ్రంగా గాయపడి జలగం నగర్‌కు చేరగా స్థానికులు అధికారులకు తెలపగా పార్క్‌లో వదిలేశారు. ఆ తర్వాత కృషి బైపాస్ రోడ్ నుంచి ఓ దుప్పిని చిన్నారులు సైకిళ్లపై పార్క్‌వైపు తరుముకుంటూ వస్తుండగా వేంసూర్ రోడ్‌లోని షాదీఖానా సమీపంలోకి చేరుకోగానే ఆర్టీసీ బస్‌ను వెనుక నుంచి ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. ఆ తర్వాత కొద్ది రోజుల తర్వాత వాకింగ్‌కు వెళ్లిన కొందరికి తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పిని గమనించి అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వైద్యం అందిస్తూ వచ్చారు. కానీ కొద్దిరోజుల తర్వాత సరైన చికిత్స అందకనో.. చికిత్సకు సహకరించకనో.. సరైన ఆహారం లేకనో.. ఏమో కానీ మృతిచెందింది. ఈ విషయాన్ని అధికారులు సైతం బయటకు తెలియకుండా ఖననం చేస్తుండగా ఆ దుప్పి కడుపులో సుమారు 7నెలల వయస్సున్న మృతకళేబరం లభ్యమైంది. పైగా దహనం చేయకుండా ఖననం చేయడం ఏమిటనే విషయాన్ని పర్యాటక ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. పార్కులో సింగరేణి సహాయంతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ప్రారంభోత్సవానికి ముందురోజే మరో దుప్పి మృతిచెందగా ఇప్పటికే పదుల సంఖ్యలో జీవాలు చనిపోతున్నా సరైన పరిష్కారం చూపడం లేదని, చుక్కల దుప్పుల రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వరి అవశేషాలను తగలబెట్టడం హానికరం

- ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

తల్లాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): నూర్పిడి అయిన పొలాల్లోని వరికాడల అవశేషాలను తగులబెట్టడం పర్యావరణం భూసారానికి హానికరమని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. శనివారం తల్లాడ మండలంలో నూర్పిడైన వరిపొలాలను సందర్శించి రైతులకు అవగాహన కలిగించారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. వరిపంట అవశేషాలను పొలాల్లో తగులబెట్టడం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పొలాల్లో ఉండే లాభదాయక సూక్ష్మజీవులు నశించడం వల్ల తదుపరి పంటలపై ప్రతికూల ప్రభావంపడుతుందని, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎండీ తాజుద్దీన్, ఏఈవో జి.శివకుమార్ పాల్గొన్నారు.

వరిమోట్లకు నిప్పు..

- సమీపంలోని వరి, జామాయిల్ తోట దగ్ధం
- ఓ రైతు చేసిన తప్పిదం మిగిల్చిన నష్టం



అన్నారుగూడెంలో దగ్ధమైన వరిపంట

తల్లాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతు చేసిన తప్పిదం అగ్నిప్రమాదానికి కారణమై.. పొరుగు రైతులకు నష్టాన్ని మిగిల్చింది. తన పొలంలోని నూర్పిడి చేసిన వరిమోట్లు, గడ్డికి నిప్పు పెట్టడంతో.. అవి ఎగిసిపడుతూ వ్యాప్తి చెంది.. పొరుగు పొలాల్లో కోతకు వచ్చిన వరిపంట, జామాయిల్ తోట, నూర్పిడి చేసి ఉన్న వరిగడ్డి దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.15లక్షల మేర నష్టం జరిగింది. శనివారం ఖమ్మంజిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో జరిగిన ఈసంఘటనకు సంబంధించిన వివరాలివీ.. అన్నారుగూడెం-బిల్లుపాడు గ్రామాల మధ్య ఉన్న మాచవరం ఆనకట్ట సమీపంలో కొత్త వెంకటగిరి గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంలోని వరి మోట్లు, వృధాగడ్డికి నిప్పు పెట్టాడు. గాలికి నిప్పు ఎగిసి పడుతూ వేగంగా వ్యాప్తి చెందాయి. కోతకు సిద్ధంగా ఉన్న అన్నారుగూడెం గ్రామానికి చెందిన రైతులు దుగ్గినేని గోపయ్యకు చెందిన మూడు ఎకరాలు, దుగ్గినేని వెంకటేశ్వర్లుకు చెందిన మూడు ఎకరాల్లో వరిపంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో పాటు కొత్త వెంకటగిరి గ్రామానికి చెందిన దిరిశాల రాఘవయ్యకు చెందిన నాలుగున్నర ఎకరాల్లోని జామాయిల్ తోట కాలిపోయింది. అలాగే పలువురు రైతులకు చెందిన పొలాల్లో హార్వెస్టర్లతో కోసి నూర్పిడి చేసి ఉన్న సుమారు 50ఎకరాల్లోని వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. అయితే చేతికొచ్చిన వరిపంట పూర్తిగా దగ్ధమవడంతో బాధిత రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రమాదానికి కారకుడైన రైతు నుంచి తమకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆ నలుగురు..

● పల్లె నుంచి కదిలి... పదవులతో వర్ధిల్లి ● సర్పంచ్‌లుగా.. ఎమ్మెల్యేలుగా...



రాంరెడ్డి వెంకటరెడ్డి మాజీ మంత్రి

ఊకే అబ్బయ్య మాజీ ఎమ్మెల్యే

గుమ్మడి నర్సయ్య మాజీ ఎమ్మెల్యే

సున్నం రాజయ్య మాజీ ఎమ్మెల్యే

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజకీయం అంటే 'పరమపద సోపానపటం' లాంటిది. ఎత్తులూ పల్లాలు.. అవమానాలు.. సన్మానాలుంటాయి. విమర్శలను తట్టుకుంటూ, విజయాన్ని సొంతం చేసుకుంటూ ఒక్కో అడుగు ఆత్మవిశ్వాసంతో వేస్తూ ముందుకు వెళ్లడం అంత తేలికైన విషయం కాదు. కొందరు నేతలు సర్పంచి పదవి నుంచి రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి ఎమ్మెల్యేల వరకు ఎదుగుతారు. ఇంకొందరు మరింత ఉన్నత స్థానాలకు చేరుతారు. ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు. జిల్లాలో ఇలాంటి వారి వివరాలను పరిశీలిస్తే ఓ నలుగురు ప్రజాప్రతినిధులు సర్పంచి హోదా నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన వారు ఉన్నారు. అంతేకాదు మంత్రి పదవిని సైతం దక్కించుకున్నారు. ఆ నలుగురిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ఇది..

వారి ప్రస్థానం గ్రామస్థాయి నుంచి మొదలయ్యింది. గ్రామ సర్పంచిగా ప్రజలకు సేవలందించిన వారు ప్రజాభిమానంతో ఎమ్మెల్యేలుగా.. మంత్రిగా పని చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నలుగురు ప్రముఖులు గ్రామం నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి వారు ఎమ్మెల్యేలుగా ఎంపికయ్యారు.

రాంరెడ్డి వెంకటరెడ్డి (మాజీ మంత్రి)

రాష్ట్ర మంత్రిగా పనిచేసి దివంగతులైన రాంరెడ్డి వెంకటరెడ్డి 1967లో జరిగిన ఎన్నికల నుంచి మూడు సార్లు కామేపల్లి మండలం పాతలింగాల పంచాయతీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాత తాలూకా సమితిలోని లింగాలకు చెందిన రాంరెడ్డి వెంకటరెడ్డి రాజకీయ జీవితం సర్పంచి పదవితోనే ప్రారంభం అయ్యింది. ఆ తర్వాత ఆయన సుజాతనగర్ నుంచి 1996, 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో రిజర్వేషన్లు మారడంతో పాలేరు నుంచి 2009, 2014లో రెండు సార్లు పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయనకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా అవకాశాన్ని కల్పించారు. కానీ 2016లో ఆకస్మికంగా అనారోగ్యంతో మృతి చెందారు.

ఊకే అబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే ఇల్లెందు

ఇల్లెందు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కూడా తన రాజకీయ ప్రస్థానం సర్పంచి పదవి నుంచే మొదలయ్యింది. ఆయన ఇల్లెందు మండలం సుదిమళ్ల పంచాయతీ నుంచి సర్పంచిగా 1981లో ఎన్నికయ్యారు. సీపీఐలో యువనాయకునిగా ఉన్న ఆయనను అప్పటి ఏఐటీయూసీ నాయకులు అచ్యుతన్ సర్పంచిగా పోటీకి నిలబెట్టారు. కాంగ్రెస్ నాయకుడు చీమల పొట్టియ్య మీద అబ్బయ్య సర్పంచిగా విజయం సాధించారు. అదే ఆయన తొలి విజయం. రైతు కుటుంబానికి చెందిన ఆయన సింగరేణి కార్మికుడిగా పనిచేశారు. 1983లో సీపీఐ ఆదేశాల మేరకు బూర్గంపాడు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1994లో సీపీఐ నుంచి మిత్రపక్షాల అభ్యర్థిగా పోటీచేసి రెండోసారి అక్కడే గెలిచారు. 2009లో టీడీపీ తరుపున మిత్రపక్షాల అభ్యర్థిగా విజయం సాధించారు. ఇలా మూడు సార్లు ఎమ్మెల్యేగా సాధించేందుకు సర్పంచిగా ఆయన చేసిన సేవలే కారణం అయ్యాయి.

గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే ఇల్లెందు

రాష్ట్రంలోనే ఐదు సార్లు కమ్యునిస్టు పార్టీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యే అయిన ఆయనది ప్రత్యేకస్థానం. కేవలం నామినేషన్ ఖర్చు తప్ప ఒక్క పైసా కూడా ఎన్నికల్లో ఖర్చుపెట్టకుండా గెలిచిన నాయకుడు ఆయన. 1981లో జరిగిన ఎన్నికల్లో ఉసిరికాయలపల్లి సర్పంచిగా తన తొలి రాజకీయ పదవిని పొందారు. సర్పంచిగా ఆయన అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదు సార్లు న్యూడెమొక్రసీ నుంచి ఎమ్మెల్యేగా ఇల్లెందు నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

సున్నం రాజయ్య, మాజీ ఎమ్మెల్యే భద్రాచలం

వర రామచంద్రాపురం గ్రామంలో సున్నం వారి గూడెం అనే కుగ్రామం ఈయనది. గిరిజన యువకుడిగా సర్పంచ్ పదవి అనంతరం రెండు సార్లు అసెంబ్లీలో తనవాణిని వినిపించారు. అప్పట్లో సీపీఎంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సున్నం రాజయ్య 1988లో చిన్నమట్టపల్లి గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ప్రజాసేవ చేసిన ఆయన 1993లో పదవీకాలం పూర్తయినా అప్పటి ప్రభుత్వం మరో ఏడాది కాలాన్ని పొడిగించింది. ఆ తర్వాత ప్రజల మన్ననలు పొందిన ఆయన 1995లో సీపీఎం పార్టీ మండల కార్యదర్శిగా పనిచేసి 1999, 2004లో భద్రాచలం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తెలుసుకోండి..

సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక ఉంటుంది..!

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ఓటర్లు ఐదేళ్ల పదవీకాలనికి సర్పంచిని ఎన్నుకుంటారు. ఆయనపై పంచాయతీ సభ్యులు అవిశ్వాస తీర్మానంపెట్టే అవకాశం లేదు. అధికార దుర్వినియోగం, అవినీతికి పాల్పడితే పదవి కోల్పోయే అవకాశం ఉంటుంది. దీనిపై కలెక్టర్ విచారణ నిర్వహించి ఆరోపణలు ఎదుర్కొనే సర్పంచిని తొలగించే అవకాశం ఉంటుంది. గ్రామ సభ సమావేశాలు ఏడాదిలో రెండుసార్లు విధిగా నిర్వహించాలి. లేదంటే సర్పంచి పదవిని కోల్పోతాడు. ఆడిట్ పూర్తి చేయనప్పుడు ఆ పదవి పోతుంది. సర్పంచి పదవి ఖాళీ అయితే నాలుగు నెలల్లో ఉప ఎన్నికను నిర్వహిస్తారు.

● ఉపసర్పంచిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ఆయన పదవిని చేపట్టిన నాలుగేళ్లలో తీర్మాణం పెట్టాలి. మొత్తం సభ్యుల్లో సగానికి తగ్గకుండా అవిశ్వాస తీర్మానంపై సంతకం చేస్తే ఆర్డీవోకు అందచేయాల్సి ఉంటుంది. మొత్తం సభ్యుల్లో 2/3వంతు ఆమోదం తెలిపితే ఉపసర్పంచి పదవిని కోల్పోతాడు. ఉప సర్పంచి పదవి ఖాళీ అయ్యాక 30రోజుల్లో వార్డు సభ్యులంతా కలిసి ఎన్నుకోవాల్సి ఉంటుంది.

పంచాయతీల్లో ముగ్గురు కోఆప్షన్ సభ్యులు

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, జిల్లా పరిషత్, పురపాలికలు, నగరపాలికల తరహాలోనే గ్రామ పంచాయతీలకు కోఆప్షన్ సభ్యులను నియమించనున్నారు. వీరి నియామకం ద్వారా వారి సలహాలు, సూచనలతో గ్రామాభివృద్ధిలో వేగం పెరుగుతుందని ఈ విధానానికి నాందిపలికారు. గ్రామసమాఖ్య అధ్యక్షులని, గ్రామాభివృద్ధికి విరాళాలిచ్చే దాతలను, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులని కోఆప్షన్ సభ్యునిగా పాలకవర్గంలో నియమించేందుకు అవకాశం ఉంది.

సమావేశాలకు హాజరైతే భత్యం

సర్పంచి వేతనాలను ఇప్పటికే ప్రభుత్వం అందచేస్తుంది. ఒక్కో సర్పంచికి నెల వేతనంగా రూ.5వేలను అందిస్తోంది. అయితే ఇక నుంచి పాలకవర్గ సమావేశాలకు హాజరయ్యే వార్డు సభ్యులకు కూడా భత్యం ఇవ్వనున్నారు. గతంలో మేజర్ పంచాయతీల్లో సమావేశాలకు హాజరయ్యే సభ్యులకు మాత్రమే భత్యాన్ని ఇచ్చేవారు. ప్రస్తుతం అన్ని పంచాయతీలకు వర్తింపచేయాలని కొత్త పంచాయతీ చట్టంలో రూపొందించారు.

సమాచారం కోసం 'టీ-పోల్ యాప్'

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సులభంగా ఎన్నికల సమాచారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీ-పోల్ (టీఈ పీవోఎల్ఎల్) మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటర్లు గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి దీన్ని సులభంగా డౌన్‌లోడ్ చేసుకునే ఆస్కారం ఉంది. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటరు స్లిప్పులు, ఎన్నికల నిర్వహణలో ఫిర్యాదు చేయడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. యాప్‌ను ఓపెన్ చేసి మనకు కావాల్సిన సమాచారాన్ని అందులో నిక్షిప్తం చేస్తే వెతికి పెడుతుంది. ఈ యాప్‌పై ఓటర్లకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుంది.



25మందిపై బైండోవర్ కేసులు : సీఐ

జూలూరుపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మందిపై శనివారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలోని జూలూరుపాడు, పాపకొల్లు, బోజ్యాతండా, కాకర్ల గ్రామాల్లోని బెల్ట్‌షాపుల నిర్వాహకులు, రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులపై బైండోవర్‌లు నమోదు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

బరిలో అభ్యర్థులు..

ప్రతీ పైసాకు లెక్కచెప్పాల్సిందే..

సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికల ఖర్చు పరిమితి

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారంలో తాము చేసే ప్రతి ఖర్చుకూ లెక్కలుండాల్సిందే. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖరారు చేసింది. ప్రచార ఖర్చులను తగ్గించాలన్న లక్ష్యంతో నిబంధనలను ఖరారు చేసి వాటిపై అత్యంత నిఘా వేయనున్నారు. ఎన్నికల సంఘం అభ్యర్థులకు అందించిన పుస్తకంలో ప్రచార ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు ఏ రోజుకారోజు లెక్కలను పరిశీలకులకు అందించాల్సి ఉంటుంది.

అభ్యర్థుల మార్గదర్శకాలు ఇలా..

● గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వార్డు సభ్యులు నామినేషన్ దాఖలుకు ముందుగానే బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుంది.

● 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల్లో పోటీ చేసే వార్డుసభ్యులు రూ.30వేలు, సర్పంచి అభ్యర్థులు రూ.1.50 లక్షలు వరకు ఖర్చు చేయవచ్చు.

● 5 వేలకు పైగా జనాభా ఉన్న గ్రామపంచాయతీల్లో పోటీచేసే వార్డు సభ్యులు రూ.50 వేలు, సర్పంచి అభ్యర్థులు రూ.2.50 లక్షలు వరకు పరిమితి ఉంటుంది.

● ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును ఏ రూపంలో నిల్వ చేశారనే వివరాలను నామినేషన్ వేసేటప్పుడే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెలియజేయాల్సి ఉంటుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించే ప్రచారఖర్చును పుస్తకాల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.

మూడు విడతలుగా తనిఖీలు..

అభ్యర్థుల నామినేషన్ దాఖలుచేసిన రోజు నుంచి పోలింగ్ సమయం వరకు ఎన్నికల సంఘం అధికారులు సర్పంచ్‌ల ప్రచార ఖర్చులను మూడు పర్యాయాలు పరిశీలించనున్నారు. దీంతో ఎన్నికల వ్యయాన్ని కట్టడి చేయాలన్న లక్ష్యంతో కమిషన్ ఈ నిర్ణయాన్ని అమలుచేస్తుంది. పోటీ చేసే అభ్యర్థులకు నిబంధనావళిపై అవగాహన కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సుభాష్‌నగర్ మాజీ సర్పంచ్ అదృశ్యం?



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ శుక్రవారం రాత్రి నుంచి అదృశ్యం అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ మంగమ్మ శుక్రవారం సాయంత్రం వరకు తన కుటుంబ సభ్యులతో గడిపారు. అంతలోనే అనూహ్యంగా అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుమారుడు, భర్త అయ్యాప్ప పడిపూజకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో కనిపించక పోవడం, తన సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో హైరానా చెందిన కుటుంబ సభ్యులు ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ మంగమ్మ అదృశ్యంపై కేసు నమాదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ అదృశ్యంపై కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా నాలుగో మహాసభ శనివారం ఖమ్మంలోని విజయనగర్‌కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు పి.మురళీధర్‌రావు, అధ్యక్షుడిగా వెంకట పిచ్చయ్య, ఉపాధ్యక్షులుగా జి.అప్పారావు, కె.భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శిగా టి.జనార్దన్ స్వామి, సహాయ కార్యదర్శులుగా ఎస్.రాజేంద్ర ప్రసాద్, ఆర్.నారాయణ, కోశాధికారిగా ఉపేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పి.గోపీచంద్ మాట్లాడుతూ 2024 నుంచి రిటైరైన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. రిటైరై ఏడాది దాటినా ఇంతవరకు ప్రభుత్వం నుంచి రావలసిన బెనిఫిట్స్ రాకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక నిరోధచట్టం వల్ల కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు నష్టం కలుగుతుందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం కలిగించే ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని కోరారు.

ప్రేమించాలంటూ మైనర్‌కు వేధింపులు

పరిచయాన్ని ఆసరా చేసుకుని వెంటపడుతున్న వైనం

ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఘటన

సత్తుపల్లిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమించాలంటూ వెంటపడుతూ 17ఏళ్ల మైనర్‌ను వేధిస్తున్న ఇద్దరు యువకులపై శనివారం పోక్సో కేసు నమోదైంది. సత్తుపల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. సత్తుపల్లికి చెందిన పఠాన్ షాకీర్, షేక్ లాల్‌మౌలా అలియాస్ షరీఫ్ అనే ఇద్దరు యువకులు పట్టణంలోని ఓ ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఏడాది క్రితం తమ స్నేహితుల ద్వారా ఆ మైనర్‌తో పరిచయం ఏర్పడింది. స్నేహితుల ద్వారా పరిచయమవ్వగా కొంత కాలంగా వారిద్దరు తమను ప్రేమించమంటూ ఆమె వెంటపడుతున్నారు. విసిగిపోయిన ఆ మైనర్... ఆ యువకులు తనతో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఒకరి తర్వాత ఒకరు ప్రేమ పేరుతో తన వెంట పడుతున్నారని, తనకు ఇష్టం లేదని స్పష్టం చేయడంతో ఇద్దరూ కలిసి తనను బెదిరించడమే కాకుండా దాడి కూడా చేశారంటూ శనివారం ఆమె సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రదీప్ కేసు నమోదు చేశారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని సత్తుపల్లి పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు.

ఎన్నికలకు 'నాన్ ఏజెన్సీ' బ్రేక్

జూలూరుపాడు, చాపరాలపల్లి, ఏన్కూరు పంచాయతీల ఎన్నిక నిలిపివేత

జూలూరుపాడు/ ములకలపల్లి/ ఏన్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జూలూరుపాడు, ములకపల్లి మండలంలోని చాపరాలపల్లి, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు గ్రామ పంచాయతీలకు కోర్టు కేసుల కారణంగా ఎన్నికలను నిలిపేశారు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెంజిల్లా జూలూరుపాడు గ్రామ పంచాయతీ ఎన్నిక ప్రక్రియను నిలివేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఎంపీడీవో పూరేటి అజయ్‌కు ఆదేశాలు జారీ చేశారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జూలూరుపాడు పంచాయతీ ఎన్నికకు సంబంధించి ఎలాంటి ప్రక్రియ చేపట్టవద్దని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని సూచించారు. జూలూరుపాడు రెవెన్యూ గ్రామం(పంచాయతీ) రాష్ట్రపతి గెజిట్ జారీ చేసే సమయానికి మధిర తాలుకాలోని చంద్రుగొండ పరిధిలో ఉందని, అయినప్పటికీ దాన్ని ఏజెన్సీ పంచాయతీగా ప్రకటించడం సరికాదని జూలూరుపాడు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తాళ్లూరి రామారావు హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆ కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. కాగా ప్రస్తుత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో జూలూరుపాడు సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారు. మూడో విడతలో భాగంగా డిసెంబరు 17న ఎన్నికలు జరగనుండగా డిసెంబరు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జూలూరుపాడు పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టులో జూలూరుపాడుకు సంబంధించిన పిటీషన్ ఉన్నందున ఎన్నిక ప్రక్రియ నిలిపివేయాలంటూ భద్రాద్రి కలెక్టర్ ఆదేశించారు. దీంతో జూలూరుపాడు పంచాయతీలో ఎన్నిక వాయిదా పడినట్లు ఎంపీడీవో పూరేటి అజయ్ తెలిపారు. ఇక ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి గ్రామపంచాయతీలో ఎన్నికల ప్రక్రియ కూడా హైకోర్టు ఆదేశాలతో నిలిచిపోయింది. చాపరాలపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి నాన్ ఏజెన్సీ అంశంపై కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు మండల ప్రజాపరిషత్ అధికారి, మండల ఎన్నికల అధికారి రామారావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఆదేశాలు.. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఖమ్మం జిల్లా ఏన్కూరు మేజర్ గ్రామపంచాయతీలో తొలిసారి ఎన్నికల సందడి లేకుండాపోయింది. సుమారు 6వేల జనాభా ఉన్న ఈ పంచాయతీతో పాటు జన్నారం, నాచారం, ఆరికాయలపాడు గ్రామపంచాయతీల ఎన్నికలు కూడా కోర్టు కేసుతో నిలిచిపోయాయి. ఏన్కూరు మండలంలోని ఏన్కూరు, తూతక్క లింగన్నపేట, లచ్చగూడెం, శ్రీరామగిరి, ఆరికాయలపాడు, జన్నారం, గార్లఒడ్డు, నాచారం, రేపల్లేవాడ, మేడేపల్లి గ్రామాలు 1950కి ముందు మధిర తాలూకాలో ఉన్నాయి. మధిర తాలూకా పూర్తి మైదాన ప్రాంతంలో ఉంది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ తర్వాత మధిర తాలూకాలోని ప్రస్తుత ఏన్కూరు మండలలోని గ్రామాలను పాల్వంచ తాలూకా ఏజెన్సీ ప్రాంతంలో రాష్ట్రపతి ఉత్తర్వులు లేకుండా బలవంతంగా కలిపారని ఆరోపిస్తూ 2014లో గిరిజనేతరులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా గ్రామపంచాయతీ ఎన్నికలపై కోర్టు స్టే విధించింది. దీంతో కోర్టు తుది తీర్పుకోసం అభ్యర్థులు వేచి చూస్తున్నారు.



జూలూరుపాడు గ్రామపంచాయతీ కార్యాలయం



ఏన్కూరు గ్రామపంచాయతీ కార్యాలయం

నాడు సర్పంచ్.. నేడు వార్డుమెంబర్‌గా..

అశ్వాపురం నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీకి తాజా మాజీ సర్పంచ్‌గా పనిచేసిన వ్యక్తి ప్రస్తుతం రిజర్వేషన్లు మారటంతో అదే పంచాయతీలో వార్డుమెంబరుగా పోటీకి దిగటం చర్చనీయాంశమయ్యింది. రామచంద్రాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి ఈ దఫా జనరల్‌కు రిజర్వు అయ్యింది. కాగా గతంలో ఎస్టీజనరల్‌కు రిజర్వు కాగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన కాకా అశోక్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా ప్రస్తుతం జనరల్‌కు రిజర్వు కావటంతో అశోక్ కాంగ్రెస్ పార్టీ తరఫున 8వ వార్డు నుంచి పోటీకి నామినేషన్ దాఖలు చేశారు.



వార్డునెంబర్‌గా నామినేషన్ వేస్తున్న మాజీ సర్పంచ్ కాకా అశోక్

48 గంటల్లో పదకొండు కాన్పులు

అశ్వారావుపేట ఆసుపత్రిలో సౌకర్యాల మెరుగుదలతో తీరుతున్న ఇబ్బందులు



అశ్వారావుపేట రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు ఉండడంతో పురిటికష్టాలు తీరనున్నాయి. గత రెండు రోజుల్లో ఇక్కడి వైద్యులు 11 కాన్పులు చేశారు. అందులో ఎనిమిది సాధారణ కాన్పులు కాగా మరో ముగ్గురికి ఆపరేషన్లు చేసి బిడ్డలకు జన్మనిచ్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ రాధా రుక్మిణి, డాక్టర్ మౌనిక, ఇతర సిబ్బంది పురుడుపోశారు. అలాగే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక శ్రద్ధతో వైద్యుల నియామకంతో పాటు సౌకర్యాలు మెరుగయ్యాయి. ఆసుపత్రిలో బిడ్డల ఎదుగుదలను చూసే టిఫా స్కాన్‌వంటి అత్యాధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పిల్లల వైద్యనిపుణులు, మత్తు వైద్యుడు, ప్రసూతి వైద్యులు అందుబాటులో ఉండటంతో ప్రసూతి సేవలు మెరుగయ్యాయి. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధారుక్మిణి మాట్లాడుతూ ఈ నెలలో యాభైకు పైగానే ప్రసవాలు జరిగాయని, గర్భవతులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు.

బిడ్డ అన్నప్రాశన రోజే మృత్యుఒడికి

గుండెపోటుతో గంగారంలోని 15వ బెటాలియన్ కానిస్టేబుల్ మృతి



ద్వారకా తిరుమలలో చిన్నారికి అన్నప్రాశన జరిపిస్తున్న హనుమంతరావు, విజయ

సత్తుపల్లిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లేక లేక పుట్టిన కూతురుని చూసి మురిసిపోతూ.. ఆ చిన్నారికి దైవసన్నిధిలో ఘనంగా అన్నప్రాశన జరిపించిన రోజే ఆ తండ్రి గుండెపోటుతో కన్నుమూసిన సంఘటన శుక్రవారం రాత్రి సత్తుపల్లిలో జరిగింది. మృతుడి భార్య విజయ తెలిపిన వివరాల ప్రకారం... ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతన్‌పల్లికి చెందిన నల్లబోయిన హనుమంతరావు (40) సత్తుపల్లి మండలం గంగారంలోకి 15వ బెటాలియన్‌లో 2007 నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ స్థానిక వెంకటేశ్వర టాకీస్‌రోడ్‌లో నివాసం ఉంటున్నాడు. 20ఏళ్ల క్రితం విజయతో వివాహమవ్వగా ఆలస్యంగా సంతానం అందింది. ఆరునెలల క్రితం వీరికి పాప జన్మించగా శుక్రవారం ఆ చిన్నారి అన్నప్రాశన వేడుకను ఏపీలోని ద్వారకా తిరుమలలో ఘనంగా జరిపించారు. రాత్రి కుటుంబంతో కలిసి ఇంటికి చేరుకున్న హనుమంతరావు భోజనం చేసి నిద్రకు ఉపక్రమించే ముందు ఇంటిపక్కన ఖాళీ స్థలంలో వాకింగ్ చేస్తూ కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. హనుమంతరావు భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని సత్తుపల్లి పట్టణ సీఐ టి.శ్రీహరి తెలిపారు. 20ఏళ్ల తర్వాత కలిగిన బిడ్డకు అన్నప్రాశన జరిపించి ఆనందంలో మునిగిపోయిన ఆ తండ్రి అదేరోజు కన్నుమూయడంతో ఆయన భార్య, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.



రిటైర్డ్ ఉద్యోగి నజీర్‌కు మేయర్ సంతాపం

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌పీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన రోజుల్లో ఎండీ నజీర్(75) ఎన్నో మంచి పనులు చేశారని, ఆయన కుటుంబ సభ్యులతో ఎంతో మంచి సంబంధాలు ఉన్నాయని మేయర్ దంపతులు పునుకొల్లు నీరజ, రామబ్రహ్మం సంతాపం తెలిపారు. 26వ డివిజన్ సుగ్గలవారి తోటలో నివాసం ఉంటున్న నజీర్ శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మేయర్ దంపతు నజీర్ భౌతికకాయంపై పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న కుటుంబ అనుబంధాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు సుగ్గల ఈశ్వరలింగం, వలబజ్జి ప్రసాద్ పాల్గొన్నారు.



కళాక్షేత్రంలో ఆధునికీకరణపై సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్తరామదాసు కళాక్షేత్రం ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం కళాక్షేత్రాన్ని మున్సిపల్ కమీషనర్ అభిషేక్ ఆగస్త్యతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఆధునీకరణ పనులపై టాప్‌ప్రూఫ్ లీకేజీ, ఎంట్రీ,ఎగ్జిట్‌గేట్, పార్కింగ్, కలర్‌వాష్, పరిసరాలలో పచ్చదనం కోసం మొక్కల పెంపు, నిర్వాహణ, మరమ్మతు పనులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరించి, మౌళిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కళాక్షేత్రం ఆకర్షణీయంగా తయారు చేయడం, సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగుపర్చడం, పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటీరియర్ మరింత ఆకర్షణీయంగా తయారు చేయడం, కళాక్షేత్రంలో ఏసీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. వెనుక ఉన్న ప్రేక్షకులకు డయాస్ స్పష్టంగా కనిపించేలా రూపొందిచాలన్నారు. కలెక్టర్ వెంట జడ్పీసీఈఓ దీక్షారైనా, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమీషనర్ అనిల్, అర్బన్ తహసీల్దారు సైదులు, మునిసిపల్ డీఈ ధరణి కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ పాల్గొన్నారు.

రాజకీయ అండ.. కార్పొరేషన్ ఆదాయానికి గుదిబండ

వ్యాపారులను ట్రేడ్‌లైసెన్స్ అడగ్గానే కార్పొరేటర్ల ఫోన్లు

జరిమానా విధించినా జరగని చెల్లింపులు

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి రాష్ట్రంలోనే ముందు వరసలో ఉన్న ఖమ్మం నగరం ఆదాయ రాబడిలో మాత్రం ఆమేరకు రాబట్టలేక పోతుంది. నగరం భారీగా అభివృద్ధి చెందినా దశాబ్దాల నాటి ట్రేడ్‌లైసెన్స్‌లు ధరలనే ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. ఖమ్మం నగరంలో గాంధీచౌక్‌ప్రాంతంలో 36,37డివిజన్లు వ్యాపించి ఉన్నాయి. ప్రస్తుత ఖమ్మం నగరం పూర్వం ఖమ్మం మెట్టుగా ఉన్న సమయంలో కూడా ట్రేడ్‌లైసెన్స్‌లు మంజూరు జరిగాయి. అయితే ఇప్పుడు గాంధీచౌక్ ప్రాంతం వ్యాపారపరంగా భారీగా అభివృద్ధి చెందింది. ఓ వ్యాపార దుకాణం ఎదురుగా ఉన్న రహదారి వెడల్పును అనుసరించి ట్రేడ్‌లైసెన్స్ ధరలు నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ 37, 37 డివిజన్లలో కొంతమంది వ్యాపారులు 2022 తర్వాత లైసెన్స్‌లు తీసుకోవటమే వదిలేశారు. ఖమ్మం నగరపాలక సంస్థ ఉద్యోగులు ఆయా వ్యాపారుల వద్దకు వెళ్లి ట్రేడ్‌లైసెన్స్ అడగగానే అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు ఫోన్లు చేస్తున్నారు. వారివద్ద అడగవోద్దని హెచ్చరిస్తున్నారు.



ప్లాస్టిక్‌పై జరిమానాలు విధిస్తున్న కేఎంసీ అధికారులు(ఫైల్)

జరిమానా విధించినా జరగని చెల్లింపులు

ఖమ్మంనగర పాలక సంస్థ అధికారులు నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులు, అక్రమవ్యాపారం చేసే వారికి మున్సిపల్ యాక్టు మేరకు జరిమానాలు విధిస్తారు. అయితే శుక్రవారం కేఎంసీ అధికారులు 36వ డివిజన్‌లో దుకాణాలను తనిఖీలు చేశారు. చాలా దుకాణాలకు అసలు ట్రేడ్‌లైసెన్స్‌లు లేవు. ఇకప్లాస్టిక్ అమ్మకాలు కేజీలు కొద్ది దొరికాయి. అధికారులు ఆయా వ్యాపారులకు రూ.1,06,000 వరకు విడివిడిగా జరిమానాలు విధించారు. కానీ రాజకీయ పలుకుబడి కలిగినవ్యాపారులు జరిమానాలు కూడా చెల్లించలేదు. మేము తర్వాత చెల్లిస్తాం... మా దుకాణాల ముందు నుంచి బయటకు వెళ్లండి అంటూ కేఎంసీ ఉద్యోగులను బయటకు పంపారు. ఈ సంఘటనతో కేఎంసీ అధికారులు నెవ్వరపోయారు. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించి నిభందనల మేరకు ట్రేడ్‌లైసెన్స్ లు జారీ చేస్తే కేఎంసీకి రూ.లక్షల్లో ఆదాయం పెరిగే అవకాశం మెండుగా ఉంది.

రేపటినుంచి ఇగ్నో పరీక్షలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దేశ వ్యాప్తంగా టర్మ్ అండ్ ఎగ్జామినేషన్స్‌ను సోమవారం నుంచి 14 జనవరి, 2026, వరకు నిర్వహించనున్నారు.డిగ్రీ,పీజీ విద్యార్థులతో పాటుగా డిప్లమా, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాదులో ఆరు, వరంగల్‌లో ఒకటి, బోధన్‌ఒకటి, నల్గొండలోఒక పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్లను ఇగ్నో వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోని పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఐద్వాజాతీయ సభలను జయప్రదం చేయండి

ఖమ్మంఅర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జనవరి25 నుంచి28 వరకు హైదరాబాద్‌లో జరిగే ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా డివిజన్ కార్యదర్శి పత్తిపాక నాగసులోచన పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన ఐద్వా ఖమ్మండివిజన్ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బాగం అజిత, మెహరున్నీసాబేగం, బీబీ, సునీత,రమ, ఫరీద,బేగంపాల్గొన్నారు.

వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి

» జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సీపీఐ వినతి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మొహమ్మద్ సలాం విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై అనేక సార్లు విజ్ఞప్తి చేసిన భర్తీచేయట్లేదని ముగ్గురు మంత్రులు జిల్లాలో ఉన్నప్పటికీ ప్రజలకు ఉపయోగపడే పని చేయట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీపీఐ ప్రతినిధి బృందం ప్రభుత్వ హాస్పిటల్ నీ సందర్శించారు. తొలుత రోగులతో మాటాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ సూపరిన్‌టెండెంట్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివ రెడ్డి,జిల్లానాయకులు, త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్,జాల నర్సింహారావు, చానా, శేఖర్ నాయక్, రహమాన్, ముజమ్మిల్, నర్సింహచారి, దుర్గా నాథ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలి

మల్లెంపాటి అప్పారావు

ఖమ్మంమామిళ్లగూడెం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నాయకుడు మల్లెంపాటి అప్పారావు కోరారు. శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించిన అనంతరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామపంచాయతీలకు జవసత్వాలు తీసుకొచ్చిన తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వారిని ఆదరించాలన్నారు.తెలంగాణలో మరో మారు టీడీపీ అభ్యర్థులను గెలిపించి చంద్రబాబు సంకల్పం నెరవేరడానికి కార్యకర్తలు కృషి చేయాలని అప్పారావు ఈసమావేశంలో నాగార్జునపు శ్రీనివాస్, నల్లమోతు సత్యనారాయణ రావి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాదచారులకు సౌకర్యవంతంగా ఫుట్‌పాత్‌లు

» కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): పాదచారులు, దివ్యాంగులకు సౌకర్యవంతంగా నగరంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం జరపాలని, నాణ్యత ప్రమాణాలతో పాటుగా సమీపంలో గ్రీనరి నిర్మాణాలు జరపాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిర్మాణం జరుగుతున్న ఫుట్‌పాత్‌లను కమిషనర్ తనిఖీలు చేశారు. దశాబ్దాల పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో సంచరించే ప్రాంతాలు కావున పనుల నాణ్యతలో ఎటువంటి రాజీపడోద్దని ఆదేశించారు. ఖచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఫుట్‌పాత్‌ల వెంట అందమైన గ్రీనరి, దుర్వాసన లేని డ్రైయినేజీలు నిర్మాణం చేయాలన్నారు. ఇతర ప్రభుత్వశాఖలు, విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.



ఫుట్‌పాత్‌ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

యుగంధర్‌ను కలిసిన నూతి



రఘునాథపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షునిగా నూతి సత్యనారాయణ శనివారం తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర యువజన నాయకుడు తుమ్మల యుగంధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధురమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, శ్రీరామనేని భాస్కర్, తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల కేంద్రంలో పలు పార్టీలకు చెందిన కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. శనివారంరాత్రిరఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచి గుడిపూడి రామారావు ఆధ్వర్యంలో కొంతమంది వ్యక్తులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగందర్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతించారు.

మహిళా న్యాయవాదుల క్రికెట్ పోటీ

ఖమ్మంలీగల్,నవంబరు29(ఆంధ్రజ్యోతి): మహిళా న్యాయవాదుల క్రికెట్ పోటీని శనివారం బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ న్యాయవాది ఖయ్యూమ్, ఏడునూతల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, నవీన్‌చైతన్య, రవిచంద్రశేఖర్, స్వర్ణకుమారి, వెంకటలక్ష్మి, రమాదేవి, శ్రీలక్ష్మి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పోరుకు సర్వం సిద్ధం

» నేలకొండపల్లి మండలంలో 300 పోలింగ్ కేంద్రాలు

నేలకొండపల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సంగ్రామానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 32గ్రామ పంచాయతీలకు 300 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నిక జరిగే ప్రాంతాలు 39గా ఉన్నాయని జిల్లా సహాయ ఎన్నికల అధికారి/ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారిగా తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఉంటారన్నారు. పైనంపల్లి వద్ద ఓ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు 330 మంది పీఓలు, 430 మంది సిబ్బందితో పాటు రిజర్వ్‌లో కొంత మందిని ఉంచామన్నారు.

10 నామినేషన్ కేంద్రాలు...

32 గ్రామపంచాయతీలకు నామినేషన్లు స్వీకరించటానికి 10 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి ఎర్రయ్య చెప్పారు. రాజేశ్వరపురం, కోనాయగూడెం, నేలకొండపల్లి, ముజ్జుగూడెం, కొత్తకొత్తూరు, బోదులబండ, మండ్రాజుపల్లి, చెర్వుమాధారం, రావిగూడెం, నాచేపల్లి కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ప్రతీ నామినేషన్ కేంద్రం వద్ద సహాయక కేంద్రం ఏర్పాటు చేస్తామని, సహాయక కేంద్రంలో కార్యదర్శులుంటారన్నారు. ఎన్నికల సామగ్రిని కొత్తకొత్తూరు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి పంపిణీ చేస్తామన్నారు.

నేటినుంచి నామినేషన్లు

నేలకొండపల్లి మండలంలో రెండోవిడతలో పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని డీఎవ చెప్పారు. నామినేషన్లు నేటినుంచి మంగళవారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు.6వ తేదీ మధ్యాహ్నం 3గంటల లోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని,3గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటించనున్నట్లు డీఎవ చెప్పారు. డిసెంబరు14 పోలింగ్ నిర్వహిస్తామని, 2గంటల నుంచి ఓట్లలెక్కింపు జరిపి ఫలితాలను ప్రకటిస్తారని, వెంటనే ఉపసర్పంచ్‌ఎన్నికను నిర్వహిస్తారని డీఎవ ఎర్రయ్య చెప్పారు. ఏదేని కారణం వలన ఉప-సర్పంచ్ ఎన్నిక జరగనట్లైతే, ప్రభుత్వ సెలవుదినం అయినప్పటికీ మరుసటిరోజు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎర్రయ్య చెప్పారు.

రూరల్‌లో సర్పంచులు 21, వార్డులు 202

ఖమ్మంరూరల్: నేటినుంచి ఖమ్మం రూరల్ మండలంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.మండలలో మొత్తం 21గ్రామ పంచాయతీలకు, 202వార్డుమెంబర్‌లకు అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. ఎన్నికల అధికారులు నామినేషన్ల స్వీకరణకు 8క్లస్టర్లను ఏర్పాటు చేశారు. డిసెంబర్ 14న సర్పంచు, వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి

రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి

ఖమ్మంరూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన వాతావరనంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ముగిసేవరకు ఎలాంటి ఘర్షణలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీ నాయకులపైనే ఉంటుందన్నారు. నామినేషన్ ప్రక్రియ నుంచి మొదలుకుని అభ్యర్థుల విజయం సాధించిన తరువాత గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ప్రతి సెక్టారుకు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు చేసినట్లయితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రమేయం ఉండవద్దన్నారు. సోదరభావంతో సంయమనం పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని సూచించారు. పోలింగ్ ఓట్ల లెక్కింపు అనంతరం ఊరేగింపులు పూర్తిగా నిషేధమన్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించినట్లయితే ఒక రోజు ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మండలంలో 8సెక్టార్లు ఏర్పాటు చేశామని, ప్రతీసెక్టారుకు సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు, అన్ని రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

జోగ్గూడెం సర్పంచ్ పదవి వేలం అవాస్తవం

కామేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జోగ్గూడెం గ్రామంలో సర్పంచ్ పదవి వేలంపాట అనే ప్రచారంలో వాస్తవం లేదని జోగ్గూడెం గ్రామ పెద్దలు తెల్పిచెప్పారు. శనివారం కామేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో ఆశావాహులు అందరు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నుకుంటామని అన్నారు. అవాస్తవాలను ప్రచారం చేయవద్దని విన్నవించారు.

పాతలింగాలలో మరోమారు ఏకగ్రీవం?

కామేపల్లి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో మారోమారు సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దివంగత నేతలు రాంరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్‌రెడ్డి స్వగ్రామమైన పాతలింగాలలో ఏనాడు సర్పంచ్ ఎన్నికలు జరగలేదు. ప్రతీసారి గ్రామ పెద్దలు కూర్చొని మాట్లాడుకొని నిర్ణయం తీసుకుంటారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కమీషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి సమక్షంలో గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. కిన్నెర సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నామినేషన్ వేస్తామని చెప్పారు.

డీసీసీ అధ్యక్షుడు నూతికి సన్మానం

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైన నూతి సత్యనారాయణ గౌడ్‌ను బీసీ కులాల సమన్వయకర్త, తెలంగాణ గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూగౌడ్ ఆధ్వర్యంలో జిల్లాగౌడ సంఘం, బీసీకుల సంఘాల నేతృత్వంలో శనివారం ఖమ్మం నగరంలో సన్మానించారు. ఈ క్యార్యక్రమంలో తెలంగాణ గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూగౌడ్, బొమ్మ రాజేశ్వరరావు, చిత్తలూరి నరసయ్యగౌడ్, బొల్లికొండ దర్గయ్య గౌడ్, లింగాల రవికుమార్, గుడిద శ్రీనివాస్‌గౌడ్, మార్కంలింగయ్యగౌడ్, వీరునాయక్, దరిపల్లి కిరణ్ పాల్గొన్నారు.

జోసఫ్ మృతి సీపీఎంకు తీరని లోటు

ఖమ్మంఅర్బన్ నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ లెక్చరర్ , సీపీఎం సీనియర్ నాయకుడు ఇనుపనూరి జోసఫ్ మృతి సీపీఎంకు తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. శనివారం ఉదయం ఖమ్మంలోని తన స్వగృహంలో తుదిశ్వాసవిడిచిన జోసఫ్ భౌతిక కాయానికి సీపీఎం నాయకులు వై.విక్రమ్,మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, బండారు రమేష్ నివాళులర్పించారు.సీపీఎంజిల్లాకార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒకప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మృతి ప్రజాసంఘాలకు, పార్టీకి తీరనిలోటన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

ఘనంగా మహాపడి పూజ





ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరం ముస్తాఫానగర్‌లో శనివారంరాత్రి స్వామియో శరణం అయ్యప్ప,అన్నదానప్రభువే శరణం అయ్యప్ప అంటూ ఆ ప్రాంతం అయ్యప్ప నామస్మరణలతో మారుమ్రోగింది. ముస్తాఫానగర్‌కి చెందిన శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవాసమితిట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీపాకతిళ్ల నారాయణ నంబూద్రి చేత మహాపడి పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కోదాడభాస్కర్ గురుస్వామి భజనా బృందం ఆలపించిన భక్తిగీతాలు భక్తులను తన్మయత్వంలోకి ముంచెత్తాయి. గుంటూరుకి చెందిన రాము భవాని స్వామి పలు దేవతామూర్తుల వేషధారణలతో ఆకట్టుకున్నారు.

అయ్యప్ప స్వాముల భజనలు

నగరంలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిపాదన చేసిన స్థలంలో శనివారం అల్లిపురం, కొత్తగూడెం గ్రామాల నుంచి 200 మంది అయ్యప్ప స్వాములు పూజలు చేసి భజన చేసిశారు. ఈసందర్బంగా అయ్యప్ప స్వాములు వెంకటేశ్వర స్వామి కీర్తనలు ఆలపించటంతో వెంకటేశ్వర స్వామి నామముతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఈ సందర్బంగా రావూరి సైదుబాబు మాట్లాడుతూ టీటీడీ అధికారులు త్వరితగతిన ఆలయ పనులు ప్రారంభించి సంవత్రంలో ఆలయం భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతి నాగేశ్వరరావు, పత్తిపాటి వీరయ్య, సామినేని రాంబాబు, సామినేని సైదులు, మొర్రి మేకల కోటయ్య, కొండయ్య, ముత్తయ్య, నల్లమల ఆనంద్, నెల్లూరు కోటేశ్వరరావు, మాదినేని సతీష్, శ్రీను తదితర స్వాముల పాల్గొన్నారు.

బలమే.. ఆయుధం!

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి తమ నియోజకవర్గాల్లో కేడర్‌కు దిశానిర్దేశం చేస్తూనే బరిలో రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే మధిర, వైరా నియోజకవర్గాల్లో పలు చోట్ల రెబల్స్ నామినేషన్లు వేయగా.. వారిని బుజ్జగించే ప్రయత్నంలో ఉన్నారు. కొందరికి సర్పంచ్‌గా అవకాశం ఇవ్వకపోతే ఎంపీటీసీగా, మరి కొందరు తమకు ప్రభుత్వ నియామక పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని షరతులు పెడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ కూడా మొన్నటి వరకు స్తబ్దుగానే ఉన్నా పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మంలో దీక్షాదివస్ కార్యక్రమం వేదికగా రంగంలోకి దిగింది. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతామధుసూదన్,మాజీఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,కందాళఉపేందర్‌రెడ్డి,బానోతు చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, తదితరులు పాల్గొని పంచాయతీ ఎన్నికలకు కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అన్నిపంచాయతీలలో నామినేషన్లు వేయాలని కేడర్‌కు తెలిపారు. ఒకవైపు అధికారపక్షం, మరోవైపు విపక్షం కూడా పంచాయతీ ఎన్నికల పోరును ఢీకొనేందుకు పంచాయతీ ఎన్నికలు కొన్నిగ్రామాల్లో ఉత్కంఠత రేపనున్నాయి.

పొడిచిన పొత్తులు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్, సీపీఎంల మధ్య మైత్రీ బంధం బలపడుతోంది. కాంగ్రెస్, సీపీఐ మధ్య స్నేహబంధం కొనసాగుతుండగా బీజేపీ అక్కడక్కడ నామినేషన్లు వేయించింది. మధిర నియోజకవర్గంలో సీపీఎం, బీఆర్ఎస్ ఐక్యంగా కదులుతున్నాయి. పాలేరు, ఖమ్మం, వైరాతో పాటు ఉమ్మడిజిల్లాలో పలు నియోజకవర్గాల్లో సీపీఎం, బీఆర్ఎస్ మధ్య పొత్తుల చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్, సీపీఐ కూడా సర్దుబాటు చేసుకుంటున్నాయి. దీంతో ఏకగ్రీవం అవుతాయనుకున్న చోట కూడా అడ్డంకులు తలెత్తుతున్నాయి.

కళావతీబాయి సేవలు స్ఫూర్తిదాయకం

జిల్లా ఆస్పత్రిలో ఘనంగా పదవీ విరమణ

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): డాక్టర్‌గా, రెండుసార్లు జిల్లా వైద్యాధికారిగా, మెడికల్ కళాశాలలో సీఎస్ ఆర్ఎంవోగా ఆమె సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ప్రధాన ఆస్పత్రిసూపరింటెండెంట్ ఎం నరేందర్ అన్నారు.32ఏళ్లుగా వైద్యరంగంలో చేసిన సేవలను కొనియాడారు. ఎంత కష్టం వచ్చినప్పటికీ తాను నమ్ముకున్న వైద్యరంగానికి విశిష్ట సేవలు అందించారు అనంతరం కళావతిబాయి,శంకర్‌నాయక్ దంపతులను శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఈసందర్బంగా డాక్టర్ కళావతీబాయి మాట్లాడుతూ 32ఏళ్ల వైద్యరంగంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలను తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లావైద్యాధికారి డి.రామారావు, ఆస్పత్రి అధికారులు ఆర్ఎంఓ బి.రాంబాబు, కార్పొరేషన్ మాజీమేయర్ పాపాలాల్, మాజీ డీఎంహెచ్‌వో కొండల్‌రావు, వైద్యులు భాస్కర్ నాయక్,జయ్‌కుమార్, మోహన్‌రావు, నెహ్రూ, లక్ష్మణ్‌రావు, మురళీధర్,ఎల్ కిరణ్‌కుమార్, బి.కిరణ్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది శాంతకుమారి,ఏడీ సంతోష్, సిబ్బంది రవికిశోర్, నందగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కళావతీబాయి దంపతులను సత్కరిస్తున్న జిల్లా ఆస్పత్రి అధికారులు

శ్రీచైతన్య విద్యాసంస్థల క్రీడోత్సవాలు

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల జోనల్ క్రీడోత్సవాలను శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. పోటీలలో పాఠశాలకు చెందిన 13బ్రాంచిల నుంచి సుమారు 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను టూటౌన్ సీఐ బాలక్రిష్ణ, విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆటలు ఆడటం ద్వారా నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు.కబడ్డీ,వాలీబాల్, త్రోబాల్, ఖో-ఖో, చెస్, క్యారమ్స్, 100 మీటర్ల పరుగు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డీజీఎం చైతన్ మాదుర్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు,క్రిష్ణారావు, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ,నాగప్రవీణ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న టూటౌన్ సీఐ బాలక్రిష్ణ, మల్లెంపాటి శ్రీధర్



నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

వైరా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామినే షన్ల స్వీకరణ కేంద్రాలను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సందర్శించి పరిశీలించారు. రెబ్బవరం, గొల్లపూడిల్లోని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచ నలు చేశారు.పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లను సమీక్షిం చారు. ఎంపీడీవో సక్రియ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రెబ్బవరం నామినేషన్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న శ్రీజ

చివరిరోజు నామినేషన్ల కోలాహలం

కొణిజర్ల, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ శని వారం చివరి రోజు కావడంతో అన్ని గ్రామ పంచయాతీల్లో మధ్యాహ్నం తర్వాత కూడా అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కొణిజర్లలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామా రావు కాంగ్రెస్ తరుపున పోటీ చేసే అభ్యర్థుని ర్యాలీగా గ్రామంలోని తిరిగి అభ్యర్థి గూదె పుష్పావతిని తీసుకుని వచ్చి నామినేషన్ వేయించారు. రాజకీయ పార్టీల్లో కొన్ని గ్రామంలో కాంగ్రెస్‌కు, సీపీఐకి పొత్తులు పొడ వగా మరికొన్ని గ్రామాల్లో మాత్రం సీపీఐ, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అన్ని నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటల లోపు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవడంతో సిబ్బంది అనుమతించారు. ఒక్కసారిగా అభ్యర్థులు రావడంతో ఎన్నికల సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

బోనకల్: నామినేషన్ల దాఖలుకు చివర రోజు కావడంతో శనివారం నామినేషన్ల కేంద్రం వద్దకు అభ్యర్థులు బారులు తీరారు. మండలం లోని బ్రాహ్మణపల్లి నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో రాపల్లి, సీతానగరం, చిన్నబీరవల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో వారికి టోకెన్లు ఇచ్చారు. టోకెన్ల ప్రకారం ఒక్కొక్కరిని లోపలికి పిలిచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. రాత్రి 7 గంట లకు నామినేషన్ల కేంద్రం ఆవరణలో 65



బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో రాత్రి వేళ నామినేషన్ కేంద్రం వద్ద ఆశావహులు

మంది ఉండడంతో టోకెన్ల ప్రకారం పిలవ డంతో నామినేషన్ల దాఖలుకు అర్ధరాత్రి వరకు సమయం పట్టడంతో వారు వేచి ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు, వారి మద్దతు దారులు గంటల కొలది వేచి ఉండాల్సి రావ డంతో ఆకలితో అలమటించారు.

చింతకాని: చింతకాని మండలంలో చివరి రోజు నామినేషన్ల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. నాగులవంచ, లచ్చగూడెం, పంది ళ్లపల్లి, రామకృష్ణాపురం కేంద్రాల్లో సమయం దాటిన పోటీలో నిలిచే అభ్యర్థులు క్యూ కట్టారు దీనితో సంబంధిత ఆర్‌వోలు నామినేషన్ దాఖలు చేయటానికి వచ్చిన అభ్యర్థులకు టోకె న్‌లు జారీ చేసి సమయం కేటాయించారు. రామకృష్ణాపురం గ్రామంలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను వైరా ఇంచార్జీ ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు.

క్రమశిక్షణతో ముందుకెళ్లాలి

▸▸ అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యన భ్యసిస్తూ ముందుకెళ్లాలని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శని వారం స్థానిక శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టం, ప్రోహి బిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజీ యాక్ట్, ప్రాథమిక హక్కులు, మోటారు వాహనాల చట్టం, ర్యాడింగ్ చట్టం, బీఎన్ఎస్ఎస్ చట్టం, ఎన్‌డీపీఎస్ చట్టం, 125సీపీపీసీ చట్టం, డీవీసీచ ట్టాలతోపాటు ఎంఎల్ఎస్‌సీ విధులపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.మీరా



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి

ఖాసీం సాహెబ్, బీఎస్ఎన్.సుమబాల, జూనియర్ సివిల్ జడ్జీ వీ.లావణ్య, సెకండ్ మేజిస్ట్రేట్ జే.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపూల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు బొర్రా వెంకట్రావ్, నల్లగట్ల విజయకు మార్, ఎస్‌కే.శైలాభాను, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జేవీ.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో విజయభేరి మోగించాలి

ముదిగొండ, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఎం శ్రేణులు సంయుక్తంగా కలిసిక ట్టుగా పనిచేసి విజయభేరి మోగించాలని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిఇంచారు.



మాట్లాడుతున్న కమల్‌రాజ్

కాంగ్రెస్ పార్టీని పంచాయతీ ఎన్నికల్లో ఓడించే లక్ష్యంగా ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషిచేయాలని కోరారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు బంకా మల్లయ్య, మండల కార్య దర్శి వెంకట్, నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, తిరుమలరావు, బీఆర్ఎస్, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

▸▸ లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాద్‌రావు



తనికెళ్ళ నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు డీసీపీ(లాఅండ్ఆర్డర్)ప్రసాద్‌రావు

కొణిజర్ల,నవంబరు29(ఆంధ్రజ్యోతి): నామినేషన్ల విషయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ అదనపు పోలీస్ బందోబస్త్‌తో ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాద్‌రావు ఆదేశించారు. శనివారం నామినేషన్ల స్వీకరణ చివరితేదీ కావడంతో మండలంలోని కొణిజర్ల, తనికెళ్ళ, అమ్మపాలెం గ్రామాలలోని కేంద్రా లను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందితో మాట్లాడి ఇబ్బం దులు ఏమైన ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదనపు బందోబస్త్‌తో ప్రతి కేంద్రాన్ని నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సూరజ్ ఉన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఏన్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పీఎంశ్రీ కింద ఏన్కూరు గురుకుల విద్యాలయంలో శనివారం ఒక్క రోజు పాఠశాల స్థాయి క్రీడా పోటీ లను ఘనంగా జరిగాయి. పోటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా సాగాయి. 5వతరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 60మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడాపోటీలను ప్రిన్సిపాల్ వేమురాజు, మాజీప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ శ్రీనివాస్ ప్రారంభిం చారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం

కల్లూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని రైతువేదిక ప్రాంగణంలో శనివారం ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎన్నికల ప్రక్రియపై విధుల నిర్వహణతో పాటుగా అనుసరించాల్సిన విధి విధా నాలపై శిక్షణ ఇచ్చారు. మండల స్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిచ్చారు.కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎంపిఓ రాజారావు పాల్గొన్నారు.

బలమే.. ఆయుధం!

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి తమ నియోజకవర్గాల్లో కేడర్‌కు దిశానిర్దేశం చేస్తూనే బరిలో రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే మధిర, వైరా నియోజకవర్గాల్లో పలు చోట్ల రెబల్స్ నామినేషన్లు వేయగా.. వారిని బుజ్జగించే ప్రయత్నంలో ఉన్నారు. కొందరికి సర్పంచ్‌గా అవకాశం ఇవ్వకపోతే ఎంపీటీసీగా, మరికొందరు తమకు ప్రభుత్వ నియామక పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని షరతులు పెడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ కూడా మొన్నటి వరకు స్తబ్దుగానే ఉన్నా పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మంలో దీక్షాదివస్ కార్యక్రమం వేదికగా రంగంలోకి దిగింది. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతామధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, తదితరులు పాల్గొని పంచాయతీ ఎన్నికలకు కేడర్ సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. అన్నిపంచాయతీలలో నామినేషన్లు వేయాలని కేడర్‌కు తెలిపారు. ఒకవైపు అధికారపక్షం, మరోవైపు విపక్షం కూడా పంచాయతీ ఎన్నికల పోరును ఢీకొనేందుకు పంచాయతీ ఎన్నికలు కొన్ని గ్రామాల్లో ఉత్కంఠత రేపనున్నాయి.

పొడిచిన పొత్తులు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్, సీపీఎంల మధ్య మైత్రీ బంధం బలపడుతోంది. కాంగ్రెస్, సీపీఐ మధ్య స్నేహబంధం కొనసాగుతుండగా బీజేపీ అక్కడక్కడ నామినేషన్లు వేయించింది. మధిర నియోజకవర్గంలో సీపీఎం, బీఆర్ఎస్ ఐక్యంగా కదులుతున్నాయి. పాలేరు, ఖమ్మం, వైరాతో పాటు ఉమ్మడిజిల్లాలో పలు నియోజకవర్గాల్లో సీపీఎం, బీఆర్ఎస్ మధ్య పొత్తుల చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్, సీపీఐ కూడా సర్దుబాటు చేసుకుంటున్నాయి. దీంతో ఏకగ్రీవం అవుతాయనుకున్న చోట కూడా అడ్డంకులు తలెత్తుతున్నాయి.

రోడ్డు వేస్తేనే ఓటు

▸▸ అనంతారం, రేగులగూడెం, రామకృష్ణపురం గ్రామస్థుల ఆందోళన

కారేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతారం, రేగుల గూడెం, రామకృష్ణపురం గ్రామాలకు వెళ్ళ ప్రధాన రహదారి మార్గం అధ్వన్నంగా ఉందని ,మూడు గ్రామాలకు అధికారులు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తేనే తాము పంచా యతీ ఎన్నికల్లో పాల్గొని ఓట్లు వేస్తామని లేకుంటే పూర్తిగా భహిష్కరిస్తామని ఆ గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం ఆందోళనకు దిగారు. 2004లో గ్రామాలకు



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

రూ.80లక్షల వ్యయవంతో అప్పటి ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకటరెడ్డి పనులకు శంకుస్థాన చేశారని చాల కాలం తరువాత రోడ్డుప నులు పూర్తిఅయిన పూర్తిగా ధ్వంసం అయిపోయి గ్రామాలలోకి రావాలంటేనే ఇబ్బందులు కలుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రాంతాలకు వచ్చే అధికారు లకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించు కున్న పట్టించుకునే నాధుడే లేడని వాపో యారు. తమ ప్రాంతంలో పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరిగిన రోడ్డు వేస్తేనే వారికి ఓట్లు వేస్తామని, లేకుంటే బహిష్క రిస్తామన్నారు. మండల కేంద్రానికి మారు మూలనున్న గ్రామ పరిస్థితి ఇంత అధ్వ న్యంగా ఉన్న ఎవరుపట్టించుకోక పోవడం పట్ల పాలకులకు ఎంత శుద్ధిఉందో అర్థం అవుతోందని, మహిళలు తెలిపారు. ఇప్పటి కైన తమ గ్రామాలను నాయకులు, ప్రజా ప్రతినిధులు సందర్శించి గ్రామాలకు రోడ్ల ఏర్పాటుకు హామీ ఇవ్వడంతోపాటు పనులు ప్రాంభిస్తేనే ఈ గ్రామల ఓటర్లు పాల్గొని ఓట్లు వేస్తామని లేకుంటే బహిష్క రిస్తామని హెచ్చరిస్తున్నారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన అబ్జర్వర్

కొణిజర్ల,నవంబరు29(ఆంధ్ర జ్యోతి): నామినేషన్‌ల స్వీకర ణలో అప్రమత్తంగా ఉండా లని ఎన్నికల అబ్జర్వర్ ఖాళీ చరణ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో నరసింహరావు ఎన్నికల నామినేషన్ స్వీకరణ



సిబ్బందికి సూచించారు. ఎన్నికల అబ్జర్వర్ ఖాళీ చరణ్ మండ లంలోని అమ్మపాలెం నామి నేషన్ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. నామినేషన్ లు ఎలా స్వీకరిస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. నిబం దనలు ప్రకారం అభ్యర్థుల నుంచి నామినే షన్‌లను స్వీకరించాలని ఆదేశించారు. మండలకేంద్రం కొణిజర్ల నామినేషన్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజ పరిశీలిం చారు. నామినేషన్‌ల విధివాధానాలను సిబ్బందికి వివరించారు. అభ్యర్థుల నుంచి జాగ్రత్తగా నామినేషన్‌లను స్వీకరించాలని తెలిపారు. అనంతరం కొణిజర్ల కేంద్రాన్ని ఆర్డీవో నరసింహరావు పరిశీలించారు.

కూలీలకు చెక్‌పోస్ట్ కష్టాలు



వాహనం దిగి నడుచుకుంటూ వెళుతున్న కూలీలు (వృత్తంలో)

ఏన్కూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిఘాపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టుల వల్ల కూలీలకు ఇబ్బందిగా మారింది. ఏన్కూరు పోలీసు స్టేషన్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టు తనిఖీ వల్ల కూలీలు సమయానికి వెళ్లలేకపోతున్నారు. తల్లాడ, కల్లూరు నుంచి ఏన్కూరు, జూలూరపాడు సుజాతనగర్‌కు కూలీ పనులకోసం కూలీలు నిత్యం వేలాదిమంది వెళ్తుంటారు. ఆటోల్లో పరిమితికి మించి ఉండడంవల్ల తనిఖీ చేస్తారనే భయంతో కూలీలు వాహనాలు దిగి కొద్దిదూరం ఇబ్బంది పడుతూ నడుచుకుంటూ వెళుతున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న ఖమ్మంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో ఏన్కూరు గురుకుల పాఠశల ద్వితీయ స్థానం సాధించింది. విద్యారుర్థులు సాయి మొగల, రాకేష్, జగదీష్‌లు అత్యంత ప్రతిభచూపి ద్వితీయస్థానం సాధించా రుక. విద్యార్థులను గైడ్‌టీచర్ శివకుమా ర్‌ను ప్రిన్సిపాల్ వేమురాజు, ఏటీపీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతి

వైరా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిని శని వారం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారా యణ మర్యాదపూర్వకంగా ఖమ్మంలో కలి శారు. ఈ సందర్భంగా నూతిని ఎంపీ సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బాణోతు విజయబాయి, ముళ్లపాటి సీతరా ములు, పెద్దప్రోలు లక్ష్మయ్య పాల్గొన్నారు



నూతిని సన్మానిస్తున్న ఎంపీ రఘురామిరెడ్డి

వెదజల్లే పద్ధతిపై రైతులకు శిక్షణ

ముదిగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరిని నేరుగా వెదజల్లే పద్ధతిపై శనివారం ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ సరిత రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముదిగొండ మండలం గోకిన పల్లి గ్రామంలో రైతు శిక్షణ కేంద్రం ఖమ్మం, పీఐ ఫౌండేష్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ నేరుగా వెదజల్లే పద్ధతిలో వరి సాగులో ఉన్న లాభాల గురించి రైతులకు వివరించారు. సాగు పద్ధతిలో మెళకువలను తెలిపారు. వరి కొయ్యలను కాల్చకుండా పొలంలో కలియదున్నాలని సూచించారు. రైతు శిక్షణ కేంద్రం వ్యవ సాయ అధికారులు భాస్కర్‌రావు, అరుణకుమారి, అరుణ జ్యోతి, పీఐ ఫౌండేషన్ ప్రతినిధులు హర్ష, రేష్మ,పాల్గొన్నారు.

బిల్లులు రాక మాజీ సర్పంచ్‌ల అవస్థలు

కారేపల్లి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీచేసి గెలుపొందిన పలు వురు మాజీ స్పంచ్‌ల పదవికాలంలో చేసిన పనులకు బిల్లులు రాకవపోవడంతో అనేక ఇబ్బందు పడుతున్నారు. ఇప్పుడు వచ్చిన ఎన్నికల్లో పోటీచేయడంకంటే, ఇంట్లో కూర్చోవడంమేలు అనే దోరణిలో ఉన్నారు. అప్పులు చేసి గ్రామపంచాయతీ లలో అనేక అభివృద్ధి పనులు చేశామని, వాటికి సంబందించిన బిల్లులు లక్షలలో రావాల్సిఉందని చేసిన పనులకు బిల్లులను గత ప్రభుత్వం చెల్లించక పోవడంతో తాం అప్పులుపాలైన్నట్లు పలువురు వాపోతున్నారు. మళ్ళీ సర్పంచ్ పదవికోసం పోటీచేసేకంటే ఇంట్లో ఉండటమే,



భజ్యాతండాలో నిర్మించిన పంచాయతీ కార్యాలయం

మేలు అనే బావనలో చాలమంది మాజీ సర్పంచ్‌లు తమ అభిప్రాయాలను వ్యక్తపరు స్తున్నారు. భజ్యాతండాకు చెందిన మాజీ సర్పంచ్ బాణోత్ సంధ్య రాందాస్ బీఆర్ఎస్ నుంచి గెలిచి తమ పంచాయతీలో సొంత భవనం లేకపోవడంతో అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే లావుడ్యి రాములనాయక్ అదేశా లతో రూ22లక్షల వ్యయంతో పంచాయతీకి పక్క భవనం నిర్మించారు. కాని దానికి సంబం దించిన బిల్లులు రూపాయకూడా రాలేదని సంధ్య వాపోయారు. అలాగే అనేకమంది మాజీలు తమ పంచాయతీలలో చేసిన పను లకు బిల్లులు రాకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 41 పంచాయతీలు ఉన్నాయి.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

▸▸ కల్లూరు ఎస్ఐ హరిత

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థాల ఎన్నికల నేపథ్యంలో కల్లూరు మండలంలో గల సమస్యా త్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించినట్లు కల్లూరు ఎస్ఐ హరిత తెలిపారు. శుక్రవారం తన కార్యా లయంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘట నలకు తావు లేకుండా ప్రజలు పోలీసుశాఖ వారికి సహ కరించాలని కోరారు. సోషల్ మీడియాలో రాజకీయంగా తప్పుడు ప్రచారం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండా లని, ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరగుతుందన్నారు. మండలంలో చంద్రుపట్ల, పెద్దకోరుకొండి, తాళ్ళూరు, వెంకటాపురం గ్రామాలు సమస్యాత్మకంగా నిలిచినాయని ఎస్ఐ వివరిం చారు. ఆయా గ్రామాలపై ప్రత్యేక పోలీసు నిఘాను ఏర్పాటు చేసి తద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. స్థానిక సంస్థాల ఎన్ని కలు ప్రశాంతగా జరిగేలా ఓటర్లు సహకారించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలకు కారుకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరగుతుం దని హెచ్చరించారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మురళీ

ముదిగొండ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతి యుతంగా జరుపుకోవాలని సీఐ మురళీ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాల యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును బాధ్యతగా వినియోగించాలన్నారు. సోషల్‌మీడియాలో ఎవరైనా వ్యక్తిగత పోస్టులు, రాజకీయ పార్టీలను కించపరుస్తూ ఉద్దేశ్యపూర్వకం గాని, వ్యక్తిగతకక్ష్యలు గాని పోస్టులు చేయవద్దని కోరారు. ఎలాంటి చిన్న సంఘ టన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా డయల్ 100పోన్ చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలు గ్రామాలకు చెందిన రాజకీయ నాయకులు, రౌడీషీటర్లు, మద్యం దుకాణ నిర్వాహకులను సీఐ మురళీ ఆదేశాలతో ఇప్పటివరకు 69మందిని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు. ఎస్ఐ కృష్ణప్ర సాద్, ఏఎస్ఐ అబ్దుల్ ఖలీక్, కానిస్టేబుల్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.కల్లూరు,

అత్యవసర సమయాల్లో సన్నద్ధతతో ఉండాలి

▸▸ కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్

సత్తుపల్లిరూరల్, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): అసాధారణ పరిస్థితుల్లో శాంతిభద్రత లను కాపాడేందుకు, అత్యవసర సమయాల్లో పోలీస్ సన్నద్ధతతో ఉండాలని కల్లూరు ఏసీపీ పీ.వసుంధర యాదవ్ అన్నారు. శనివారం సత్తుపల్లి డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేష న్లను ఆమె సందర్శించి అల్లర్ల నియంత్రణ డ్రిల్‌ను పరిశీలించారు. అల్లర్లు, అశాంతి, నిరస నలు వంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పోలీస్ సిబ్బందికి శిక్షణ అందించి వారి సన్నద్ధతలను పరీక్షించారు. షీల్డ్ ఫార్మేషన్స్, అడ్వాన్స్ రిట్రీట్ కదలికలు, లాఠీ హ్యాండ్లిగ్, క్రౌడ్ డిస్పర్సల్ వ్యూహాలపై అవగాహన కల్పించారు. లా అండ్ ఆర్డర్ పరిస్థి తులలో యూనిట్ సంసిద్ధతతో ఉంటూ బృంద సమన్వయంతో వ్యవహరిస్తూ వేగవంతమైన ప్రతిస్పందనను బలోపేతం చేసేందుకు ఈ డ్రిల్ సహాయపడుతుందన్నారు. సత్తుపల్లి పట్టణ సీఐ శ్రీహరి, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏన్కూరు: కల్లూరు ఏసీపీ వసుం ధర యాదవ్ ఆదేశాలమేరకు శని వారం ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో అల్లర్ల నివారణకు మాక్‌డ్రిల్ నిర్వహిం చారు. ప్రజలు గుంపులు.. గుంపులుగా లేకుండా చూడడం, అల్లర్లపై తగు జాగ్రత్తలు తీసుకోవడం, శాంతిభద్రతలు కాపాడడంలో నిరంతరం కృషిచేయాలని అవగాహన కలిగించారు. ఎస్ఐ సంధ్య, హెడ్ కానిసేబుల్స్ శ్రీహరి, పెద్దరాజేంద ర్,రవి, వినయ్, దేవేందర్‌పాల్గొన్నారు.

వైరా: గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శనివారం వైరా, కల్లూరు డివిజన్లలోని పోలీసు సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. వైరా ఇన్‌చార్జ్ ఏసీపీ వసుంధర యాదవ్ ఆదేశాలతో ఈ రెండు డివిజన్లలోని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు తమ సిబ్బందితో భద్రతా పరమైన జాగ్రత్తలతో రక్షణా త్మక చర్యలకు సంబంధించిన మెళకు వల గురించి డ్రిల్ నిర్వహించారు.



సత్తుపల్లిలో లాఠీ హ్యాండ్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ





ఏన్కూరు, వైరాలో..

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి

▸▸ పెద్దకోరుకొండి పర్యటనలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఉపాధ్యాయ ఎమెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు మండలంలోని పెద్దకోరు కొండి గ్రామంలో శనివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నామా కృష్ణమూర్తి ఉద్యోగ విరమణ సన్మాన సభలో శ్రీపాల్‌రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెద్దకో రుకొండిలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచి సమర్థవంతగా సేవలందించిన హెచ్‌ఎం కృష్ణమూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. పీఆర్టీయూ పోరాట ఫలితంగానే నేడు ఉపాధ్యాయులు ఆత్మగౌరంతో ఉన్నారని చెప్పారు. అదేవిధంగా ఉపాధ్యాయ, ఉద్యోగుల సంబంధించి 30 శాతం పీఆర్సీ సాధించడం జరిగిందన్నారు. అలాగే మిగిలిన ఉన్న అనేక రకాల సమస్యలతో పాటుగా, ఆర్థిక బిల్లుల బకా యిలను తాను శాసనమండ లిలో ప్రస్తావించి వాటిని త్వరలో విడుదల చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా విద్యారం గాన్ని ముందుకు తీసుకెళ్లేం దుకు అవసరమైన మేరకు నిధులు కేటాయిస్తున్నార న్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించి పాఠశాలలను బలోపేతం చేయా లని ఆయన కోరారు.



నామా దంపతులను సన్మానిస్తున్న శ్రీపాల్‌రెడ్డి, నాయకులు

హెచ్‌ఎం నామా కృష్ణమూర్తికి ఘన సన్మానం

కల్లూరు మండల పరిధిలోని పెద్దకోరుకొండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యగ విరమణ చేసిన హెచ్‌ఎం నామా కృష్ణమూర్తి పద్మ దంపతులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ ఎమెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డితో పాటుగా రాష్ట్ర, జిల్లా, మండల పీఆర్టీయూ నాయకులు కట్టా శేఖర్‌రావు, ఆర్ రంగారావు, పాకాల రమేష్, ఎస్‌కే చందుసా హెబ్, ఆర్ బ్రహ్మరెడ్డి బోబోలు శ్రీనివాసరావు లతో పాటుగా మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కు మార్, టిడిపి సీనియర్ నాయకుడు కాకర్ల రంగారావుతో పాటుగా పలువురు ఉపాధ్యా యులు, పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు పూలమాలతో శాలువలు కప్పి ఘనంగా సన్మా నించారు. పలువురు వక్తలు ప్రసంగిస్తూ పాఠ శాలలో అనేక సంత్సరాల పాటుగా సేవలు అందించి ఎంతో మంది విద్యర్థులను తీర్చిదిద్ది నారని హెచ్‌ఎం కృష్ణమూర్తిని ప్రశంసించారు.